RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 38 ISSUE NO : 38 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శుక్రవారం, జూలై, 25, 2025 Friday, July, 25, 2025 | పేజిలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## రష్యాలో ఘోర విమాన ప్రమాదం

మాస్కో,జూలై24 : రష్యాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. 49 మందితో వెళ్తున్న ఓ ప్రయాణికుల విమానం అమూర్ ప్రాంతంలో కుప్పకూలింది. తొలుత ఈ విమానం అదృశ్యమైనట్లు- వార్తలు రాగా.. కాసేపటికే అది కూలిపోయినట్లు- అధికారులు నిర్ధరించారు. ఎటిసి నుంచి సంబంధాలు తెగిపోగా ఎక్కడ అదృశ్యం అయ్యిందా అన్న ఆందోళన నెలకొంది. అంతలోనే కూలిపోయినట్లు సమాచారం అందింది.



## కర్ణాటకలోనూ.. కులగణన

### ఈసారి మొబైల్ యాప్‌తో సర్వే

బెంగుళూరు: కర్ణాటక ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న సామాజిక-ఆర్థిక-విద్యా సర్వే (కుల గణన)కు సిద్ధమైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 7 వరకు 15 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ బృహత్తర సర్వేను కర్ణాటక రాష్ట్ర వెనుకబాటు తరగతుల కమిషన్ నిర్వహించనుంది. అక్టోబర్ చివరి నాటికి దీని నివేదికను సమర్పించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదేశించారు. ఈ సర్వే నివేదిక రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించనుంది.



## ముంబయి బాంబు పేలుళ్ల కేసు మహారాష్ట్ర హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ,జూలై24 : 2006 ముంబయి బాంబు పేలుళ్ల కేసులో 12మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. హైకోర్టు తీర్పును ఒక ఉదాహరణగా పరిగణించరాదని జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది.



## తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం 2.0 ఉద్యమం

- దేశానికి ఆదర్శంగా తెలంగాణ ఆర్థిక, సామాజిక సర్వే
- రాష్ట్రపతి అనుమతి కోసం ఎదురు చూస్తున్న బిసి బిల్లు

న్యూఢిల్లీ, : తెలంగాణలో శాస్త్రీయంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే దేశానికి ఆదర్శం కావాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. తెలంగాణ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేస్తోందని తెలిపారు. బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోందని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ప్రయత్నంలో కృషి చేసిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని బృందానికి మల్లికార్జున ఖర్గే కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సీఎం, డిప్యూటీ- సీఎం, మంత్రిమండలి, ఎంపీలకు ఖర్గే ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మల్లికార్జున ఖర్గే పోస్ట్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం 2.0 ఉద్యమాన్ని ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. బలహీన వర్గాల కోసమే ఈ న్యాయ పోరాటమని నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతర పోరాటం చేస్తోందని ఉద్ఘాటించారు. దశాబ్దాలుగా పక్కకు నెట్టివేయబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గళంగా కాంగ్రెస్ పనిచేస్తోందని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.

దేశ జనాభాలో మెజార్టీ సంఖ్య అయినా... కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యాసంస్థల్లో వర్ణహీనత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో కూడా అన్యాయం జరుగుతోందని.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించారని గుర్తుచేశారు. 80 శాతం ఓబీసీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. అలాగే 83 శాతం ఎస్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు.




## అనిల్ అంబానీ కార్యాలయాల్లో సోదాలు

### ఆర్థిక అవతవకలపై ఫిర్యాదులతో చర్యలు

ముంబయి, జూలై24 : మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఢిల్లీ మరియు ముంబయిలోని రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి చెందిన సంస్థలపై ఇడి గురువారం దాడులు చేపట్టిందని అధికారులు తెలిపారు. భారీ ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సిబిఐ రెండు ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి ఈ సోదాలు జరుగుతున్నాయి.



## ఆ ఒక్క పథకంతో విప్లవాత్మకమార్పు

### మహాలక్ష్మిపై సిఎం రేవంత్ ఎక్స్‌లో పోస్ట్

హైదరాబాద్,జూలై24, తెలంగాణ దిశ : ఒక సంక్షేమ పథకం అనేక విప్లవాత్మక మార్పులకు కారణమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఆడబిడ్డలకు ఆర్థిక భారాన్ని తగ్గించిందన్నారు. ఆరోగ్య రక్షణకు ఆసరాగా నిలిచిందని పేర్కొన్నారు. ఒక్క పథకం వల్ల ఆర్టీసీ సంస్థ అప్పల నుంచి గట్టెక్కిందని తెలిపారు.



## హస్తినకు చేరిన.. ఈటెల, బండి పంచాయితీ

హైదరాబాద్, తెలంగాణ దిశ : ఇద్దరు బీజేపీ నేతల పంచాయితీ చివరకు ఢిల్లీ పెద్దల వద్దకు చేరింది. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ హుజురాబాద్ పర్యటనలో భాగంగా చేసిన కామెంట్స్ ఈటల వర్గాన్ని మనస్తాపానికి గురిచేయడం. అక్కడి బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ రాజీనామా చేయడం. ఈటల వర్గంలోని నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్ శామీర్పేటలో ఈటల నివాసంలో ఆయన్ను కలవడం, వారి బాధలను వ్యక్తం చేయడంతోపాటు బండి తో పాటు హుజురాబాద్ బీజేపీ నాయకుడు కృష్ణారెడ్డిపై ఆరోపణలు చేస్తూ ప్రసంగించడంతో పాటు, ఎంపీ బండి, ప్రస్తుత హుజురాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మధ్య సయోధ్య కుదిరిందని, ఈటలను పార్టీ నుంచి బయటికి పంపిస్తా అని ఇద్దరు మాట్లాడుకుంటున్నారని, సోషల్ మీడియా లో ఈటలపై దారుణంగా ట్రోల్ చేస్తున్నారని ఒక్కరొక్కరు తమకు తోచిన విధంగా ఆయన ముందు మాట్లాడారు. అలాగే కొంతమంది బిఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు వారి పరిస్తితి, బీజేపీ లో చేరిన తర్వాత ఉన్న పరిస్థితి నీ భేరిజువేసుకొని మాట్లాడం గమనార్హం. అందరి ప్రసంగాల్ అనంతరం మాట్లాడిన ఈటల పరోక్షంగా ఒక వ్యక్తిని ఉద్దేశించి వాడివేడి గా విరుచుకుపడ్డారు. అయితే ఆయన మాట్లాడిన మాటల్లో కొన్ని వైరల్ కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఎపిసోడ్ సంచలనం సృష్టించింది. ఈ ఎపిసోడ్ పై ఎంత రాద్దాంతం జరుగుతున్నా ఆ విషయంపై ఎవరు..



## సిటీలో ట్రాఫిక్.. కష్టాలు

### కిలోమీటరకు అరగంట సమయం



హైదరాబాద్, జూలై 24, తెలంగాణ దిశ : తెలంగాణలో గత నాలుగు, ఐదు రోజుల నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ లో వర్షాలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో నగర వాసులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైకి భారీగా వరద నీరు ప్రవహి స్తుండడంతో బయట అడుగుపెట్టేందుకు జనాలు అవస్థలు పడుతున్నారు. సాయంత్రం కాగానే వర్షం దంచికొడుతుండడంతో ఉద్యోగులు ఇంటికి వెళ్లేందుకు పెద్ద సాహసమే చేయాల్సి వస్తుంది. ఓవైపు వర్షం.. మరోవైపు ట్రాపిక్ తో భాగ్యనగర వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఉప్పల్, బేగంపేట, సికింద్రాబాద్, మెట్టుగూడ, పంజాగుట్ట, ముషీరాబాద్, తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి భారీ వరద నీరు చేరుకుంది. ఈ రోజు కూడా బేగంపేట, ప్యారడైజ్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. సికింద్రాబాద్ ప్యాట్నీ నుంచి పంజాగుట్ట వరకు వెళ్లే ఫై ఓవర్ల మీద భారీ ట్రాఫిక్ ఏర్పడింది.. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా.. ట్రాఫిక్ ముందుకు కదలడం లేదు.



## హిమాచల్ లోయలో పడిన బస్సు..

### అయిదుగురు మృతి, 20 మందికి గాయాలు

న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో ఇవాళ ఉదయం బస్సు ప్రమాదం జరిగింది. హెచ్ఆర్టీసీకి చెందిన బస్సు లోయలో పడింది. ఈ ప్రమాదంలో అయిదుగురు మృతిచెందగా, 20 మంది గాయపడ్డారు. సుమారు 25 మీటర్ల లోతుకు బస్సు దూసుకెళ్లింది. సర్కాఘాట్ నుంచి దుర్గాపూర్‌కు ఆ బస్సు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. సర్కాఘాట్ పోలీసు స్టేషన్ పరిధిలో ప్రమాదం జరిగినట్లు మండి ఎస్పీ సాక్షీ వర్మ తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. అయిదుగురు మృతిచెందారు. గాయపడ్డవారిని సివిల్ ఆస్పత్రికి తరలించారు. క్రిటికల్‌గా ఉన్న ప్యాసింజెర్లను బిలాస్‌పూర్ ఎయిమ్స్‌కు తీసుకెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 31 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గల కారణాలను ఇంకా వెల్లడించలేదు. ఈ ఘటనపై విచారణ కొనసాగుతున్నది. అవసరమైన చర్యలు తీసుకుంటామని, బాధితుల సంఖ్యను వెల్లడించనున్నట్లు ఎస్పీ సాక్షీ వర్మ తెలిపారు.

# కమీషన్ మ్యాన్ గా మారిన చైన్ మెన్...

## - మీడియా పేరుతో చేతివాటం..!?
## - అక్రమ నిర్మాణాలకు నెలవుగా నాగారం..!
## - శ్రీరామ్ నగర్ కాలనీలో అక్రమ నిర్మాణం..






**నాగారం, జూలై 25, (తెలంగాణ దిశ)** :నాగారం మున్సిపల్ చైన్ మెన్ కమీషన్ మ్యాన్ గా మారి పోయాడు. అక్రమార్కుల చేతి వాటానికి అధికారులు సైతం చెయ్యి కలుపు తుండడంతో అవినీతి ఏరులై పారుతుంది. స్థానిక 14వ వార్డు శ్రీరామ్ నగర్ కాలనీలో అక్రమ నిర్మాణాన్ని దర్జాగా నిర్మిస్తున్నారు. ఏకంగా చైన్ మెన్ గా పని చేస్తున్న సదరు ఉద్యోగి బాగానే మీడియా పేరు చెప్పి కాసులు వెనకేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారో ఏమో




ఎవరికి తెలియదు.? ఈ తంతు జరుగుతున్న నేపథ్యంలో అక్రమాలకు నాగారం మున్సిపా లిటీ అడ్డగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. శ్రీరామ్ నగర్ కాలనీలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని పబ్లిక్ గా అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటఅక్రమ నిర్మాణాలపై ఎన్నోసార్లు మీడియా కథనాల రూపంలో ప్రచురించిన సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాల గురించి పట్టించుకోకపోవడంతో ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లు కొనసాగు తుంది. ముఖ్యంగా నాగారం మున్సిపాలిటీ చైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న బిక్షపతి కాస్త కరోడ్ పతిగా ఎదుగు తున్నాడని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికా రులు తక్షణమే ఇలాంటి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకో వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఉత్తమ సేవలకు గౌరవ డాక్టరేట్



**ఆలేరు జూలై 24, (తెలంగాణ దిశ)** : సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోపరేటివ్ సోసైటీ అధ్యక్షునిగా సేవలు అందజేస్తున్న చిలుకు స్వామిని ఈఎస్ యూనివర్సిటీ హానర్ ఆఫ్ డాక్టర్ ప్రకటించింది. ఆలేరు మండలం షారాజిపేట గ్రామ నివాసి స్వామి ఒక వైపు రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూనే గ్రామంలో ఎయిడ్స్ పట్ల అవగాహన రక్తదాన, శ్రమదాన శిబిరాలు నిర్వహిస్తూ గ్రామ యువకులను చైతన్య పరుస్తున్నారు. వీరి సేవలను గుర్తించిన ఈఎస్ యూనివర్సిటీ గ్రీన్ అచీవ్ మెంట్ అవార్డు 2025 హానర్ ఆఫ్ డాక్టరేట్ ను అందజేయనున్నారు. చిలుక స్వామికి ఈ గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల పలువురు రైల్వే ఉద్యోగులు, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# గ్రామ పాలన అధికారి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



**మేడ్చల్కలెక్టరేట్, జూలై 24, (తెలంగాణ దిశ) :** గ్రామ పాలన అధికారి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కూకట్ పల్లి మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 27న జరుగనున్న గ్రామ పాలన అధికారి పరీక్ష నిర్వహణపై అదనపు కలెక్టరు తన ఛాంబర్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 55 మంది అర్హులైన ఆప్షన్ ఇచ్చిన విఆర్ఓలు ఈ పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 10 నుండి 1 వరకు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు అర గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన పేర్కొన్నారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు పోలీసు, రెవెన్యూ మెడికల్, ఎలక్ట్రిసిటి సంబంధిత శాఖల వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

# హైదరాబాద్ నుంచి భారత్ గౌరవ ట్రైన్ యాత్ర స్పెషల్ ప్యాకేజ్..

పెద్దపల్లి: హైదరాబాద్ నుంచి భారత్ గౌరవ ట్రైన్ యాత్ర స్పెషల్ ప్యాకేజ్ అందుబాటు లో ఉన్నాయని జనరల్ మేనేజర్ టూరిజం డి.ఎస్.జి.పి కిషోర్ గురువారం తెలిపారు. భారత రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ ద్వారా భారత గౌరవ టూర్ పేరుతో ప్రత్యేకం గా దేశంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను హైదరాబాద్ నుంచి పర్యటనకు ప్యాకేజీలు తయారు చేసిందని, వీటిలో ట్రైన్ జర్నీబస్ జర్నీ హెూటల్ భోజన ఖర్చులు, గైడ్ తో సహా సైట్ సీయింగ్ ఉంటాయని అన్నారు.భారత గౌరవ టూర్ లో భాగంగా హైదరాబాద్ నుంచి ఐదు ప్యాకేజీ లలో ప్రత్యేక ట్రైన్లు ఉన్నాయని తెలిపారు. మొదటి ప్యాకేజ్ కింద ఏప్రిల్ 23 నుంచి మే రెండు వరకు 9రాత్రులు,10 రోజులలో హరిద్వార్, రిషికేష్ వైష్ణవ దేవి, ఆనంద్ పూర్, నైనా దేవి, అమృత్ సర్ పర్యాటక ప్రాంతాలను చేయడం జరుగుతుందని, ప్రతి మనిషి 18 వేల 150 రూపాయల ఖర్చు అవుతుందని అన్నారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

## యుఎస్ పిసి ఆధ్వర్యంలో పరకాల తహసిల్దార్ కు వినతి



**పరకాల, జూలై 24, (తెలంగాణ దిశ) :** ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యుఎస్ పిసి) ఆధ్వర్యంలో గురువారం పరకాల తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి, పరకాల మండల అధ్యక్షులు మెరుగు ప్రసన్న, టిపిటిఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి రావు రమేష్, టీఎస్ యుటిఎఫ్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు రాజా రామ్, డిటిఎఫ్ పరకాల అధ్యక్షులు మహేందర్ సింగ్ లు మాట్లాడుతూ అన్ని క్యాడర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. జిహెచ్ఎం, ఎస్ ఏ, పిఎస్ హెచ్ఎం ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులు(జీఓ) 25ను సవరించాలని కోరారు. ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని సూచించారు. 40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలో తరగతి ఒక టీచర్ ఉండాలని, ఉన్నత పాఠశాలల్లో సబ్జక్ట్ వర్క్ లోడ్ అనుగుణంగా టీచర్ పోస్టులను కేటాయించాలని కోరారు. అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. పదవి విరమణ చేసిన ఉపాధ్యాయుల పెన్షనరీ బెనిఫిట్స్ ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఆప్షన్ ఇవ్వాలని కోరారు. అదేవిధంగా సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని కోరారు. పాఠశాల విద్యశాఖ ఏకీకృత సర్వీసు నిబంధనలు రూపొందించి డీఈవో డిప్యూటీ డిఇఓ ఎంఈఓ డిఐఈటి బీఈడీ కళాశాలల అధ్యాపకుల ఖాళీలలో శాశ్వత నియామకాలు చేపట్టాలని కోరారు. జూనియర్ లెక్చరర్ పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్లకు 40 శాతం వాటాను పునరుద్ధరించాలన్నారు. విద్యాశాఖ ఇన్ స్పెషల్ నిబంధనలకు అనుగుణంగా పర్యవేక్షణ అధికారులను నియమించాలన్నారు. ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించాలనే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు డీఈవో పోస్టు, ప్రతి రెవెన్యూ డివిజన్ కు డిప్యూటీ డిఇఓ పోస్టులు, నూతన మండలాలకు ఎంఈఓ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా 5571 ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని కోరారు. బిఈడి, డిఈడి అర్హతలున్న ఎస్ జి టి లందరికీ సీనియారిటి ప్రకారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. అప్ గ్రేడేషన్ ప్రక్రియ పూర్తయినందువల్ల 2, 3, 9, 10 జీవోలనులను రద్దు చేసి 11,12 జీవోల ప్రకారం ఎస్ జిటి, ఎల్ పి, పిఈటిలకు కామన్ సీనియారిటి ప్రకారం పదోన్నతులు కల్పించాలని వినతిపత్రంలో వారు కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలన్నారు. కేజీబీవీ, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష, కాంట్రాక్ట్ ఉద్యోగులకు బేసిక్ పే అమలు చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లోని పండిట్, పిఈటి పోస్టులను అప్ గ్రేడ్ చేసి వెంటనే ప్రమోషన్లు కల్పించాలని, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు నూతన పోస్టులు మంజూరు చేయాలని కోరారు. మోడల్ స్కూల్స్, గురుకుల సిబ్బందికి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని వారు కోరారు. దీంతో పాటు మోడల్ స్కూల్, గురుకుల, ఎయిడెడ్ టీచర్లకు హెల్త్ కార్డులు ఇవ్వాలని వారు కోరారు. పిఆర్ సి నివేదికను వెంటనే తెప్పించుకుని 2023 జూలై 1 నుంచి అమలు చేయాలని వారు కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులు 317 కారణంగా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. గురుకుల పాఠశాలల టైం టేబుల్ ను శాస్త్రీయంగా సవరించి, విద్యార్థులు, ఉపాధ్యాయులకు అనుకూలంగా మార్పులు చేయాలని యూనియన్ నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె. రవి, ఎం. రవీందర్ (ఎస్ టియు), బేబీ రజియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన అందరికీ పక్కా ఇంటి వసతి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

## అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి - కూకట్ పల్లి పరిసర ప్రాంత బస్తీ వాసులతో గృహ నిర్మాణ సంస్థ ఎండి విపి. గౌతమ్ - పలు బస్తీల్లో విస్తృతంగా పర్యటన



**కూకట్ పల్లి, జూలై 24, (తెలంగాణ దిశ):** అరకొర వసతులతో, చాలీచాలని స్థలాల్లో గుడిసెలు, షెడ్డుల్లో నివసిస్తున్న పట్టణ ప్రాంత ప్రజలకు మంచి వసతులతో సొంత ఇంటి వసతి కల్పించాలన్న లక్ష్యంతో పట్టణ ప్రాంతాల్లో జి ప్లస్.3 విధానంలో ఇళ్లను నిర్మించి ఇవ్వాలని నిర్ణయించామని, ఇందుకు ప్రజలు సహకరించాలని గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజి ంగ్ డైరక్టర్ విపి. గౌతమ్ కోరారు. కూకటపల్లిలోని ఇందిరానగర్, ఎన్టీఆర్ నగర్, మూసాపేట చిత్తారమ్మ బస్తీ, వడ్డెర బస్తీల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా బస్తీల్లోని నివాసాల వద్దకు వెళ్లి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురికివాడల్లోని పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా, సొంత ఇంటి వసతిని సమకూర్చాలని ప్రణాళిక రూపొందించామని అన్నారు. ఇందుకోసం బస్తీలు, స్లమ్ లలో నివసించే వారందరూ ఏకతాటిపైకి వస్తే మంచి ఫలితాలు ఉంటాయని ఆయన అన్నారు. ఇరుకు స్థలంలో కనీస వసతులు కూడా కరువై జీవనం సాగిస్తున్న వారికి చక్కటి సదుపాయాలతో, వారు నివసిస్తున్న ప్రాంతంలోనే జి ప్లస్ 3 విధానంలో ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్న పథకం గురించి వివరించారు. ఈ పథకంలో లబ్ధి పొందడానికి బస్తీ వాసులందరూ ముందుకు వస్తేనే ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ పథకం గురించి బస్తీల వాసులందరికీ సమగ్రంగా వివరించేలా కార్యక్రమాలను చేపట్టాలని ఆ ప్రాంత తహశీల్దార్, జిహెచ్ ఎంసి డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. ఇప్పుడు తాము నివసిస్తున్న గుడిసెలను, చిన్నపాటి ఇళ్లను తొలగించి కొత్త



ఇళ్లు కట్టేంత వరకు తాము ఎక్కడ ఉండాలని స్థానికులు అడగ్గా, ప్రభుత్వం ప్రత్యామ్నాయాలు ఆలోచించిందని, అయితే ముందు బస్తీ వాసులందరూ సంసిద్ధత వ్యక్తం చేస్తే తదుపరి అడుగులు ముందుకు పడతాయని ఎండి వివరించారు. తొలుత కూకట్ పల్లి హౌజింగ్ బోర్డు కాలనీలోని త్వరలో విక్రయించనున్న 3 ప్లాట్లను కూడా ఆయన సందర్శించారు. ఈ కాలనీలోని 2420 చదరపు గజాల ఫ్లాట్లు, 4598 చదరపు గజాలఫ్లాట్ తో పాటు, సుమారు 7.8 ఎకరాల విస్తీర్ణంలోని ఖాళీ ప్లాట్ ను కూడా హౌసింగ్ బోర్డు బహిరంగ వేలం, ఈ ఆక్షన్ ద్వారా విక్రయించడానికి నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఈ ఫ్లాట్ల కొనుగోలుకు అనేక మంది ఆసక్తి కనపరుస్తున్నారని, వేలం పాటలో పాల్గొనేందుకు దరఖాస్తులను సమర్పిస్తున్నారని బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ ఎండికి వివరించారు.

# సంపాదకీయం

## మాంద్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగం 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత తగ్గిందన్నది నిస్సందేహం. అమెరికాలోని కొందరు మితవాద ఆర్థికవేత్తలు సైతం 'ఇది దీర్ఘకాలిక మాంద్యం' అంటున్నారు (ఆ పదానికి వారిచ్చే నిర్వచనం వింతగా ఉంటుంది). ఈ అంశాన్ని కొన్ని గణాంకాల ద్వారా వివరించడం ఈ వ్యాసం ఉద్దేశం. జిడిపి ని (స్థూల జాతీయోత్పత్తి) లెక్కించే విధా నాలు ఆ యా దేశాల్లో చాలా వరకూ విశ్వసనీయత కలిగినవి కావు. ఇక మొత్తం ప్రపంచానికి సంబంధించి ప్రత్యేకంగా చెప్పనవసరమే లేదు. భారత దేశంలో అధికారిక లెక్కలను అనేకమంది పరిశోధకులు ప్రశ్నిస్తున్నారు. అధికారులేమో 7 శాతం, ఆ పైబడి వృద్ధిరేటు ఉన్నట్టు చూపుతున్నారు. కాని ఈ పరిశోధకులు అది 4 శాతం నుండి 4.5 శాతానికి మించదని, ఈ పరిస్థితి గత కొన్ని సంవత్సరాలుగా ఇదే మాదిరిగా ఉంటోందని గట్టిగా చెప్తున్నారు. ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ కొనసాగిన గత కాలంతో పోల్చి నయా ఉదారవాద విధానాల కాలంలో జిడిపి వృద్ధిరేటు గురించి చంకలు గుద్దుకోవడం అర్థం లేనిది. గత కాలంతో పోల్చితే వృద్ధిరేటు పెరిగింది పెద్దగా లేదు. పైగా అసమానతలు బాగా పెరిగిపోతున్నాయి. పోషకాహార లభ్యత గురించి లభిస్తున్న గణాంకాలను బట్టి శ్రామిక ప్రజానీకపు స్థితిగతులు బాగా క్షీణించాయని స్పష్టంగా చెప్పవచ్చు. అంత నిలకడ లేని ఈ జిడిపి గణాంకాలను పక్కనపెట్టి ప్రపంచ జిడిపి సంగతేమిటో చూద్దాం. ఇందుకోసం నేను ప్రపంచబ్యాంక్ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటున్నాను. 2015 నాటి ధరలు ఆ యా దేశాల్లో ఎలా ఉన్నాయో, పరిశీలించి, వాటిని 2015 నాటి డాలర్‌తో ఆ యా దేశాల కరెన్సీ మారకపు రేటును లెక్కలోకి తీసుకుని ఆ ప్రాతిపదికన జిడిపి లెక్కలను అంచనా కట్టారు. 1961 నుంచీ గడిచిన కాలాన్ని కొన్ని ఉప కాలాలుగా విభజించి ఆ యా ఉప కాలాలలో వృద్ధి ఏ విధంగా ఉన్నదీ పరిశీలించడం కొంచెం చిక్కులతో కూడుకున్న విషయమే. ఒక దశాబ్ద కాలాన్ని ఒక ఉప కాలంగా విభ జిస్తే గనుక దానిలో ఒక సమస్య వస్తుంది. ఆ దశాబ్దపు మొదటి ఏడాది గనుక వృద్ధి రేటు బాగా తక్కువగా ఉంటే, దాంతో పోల్చినప్పుడు తక్కిన దశాబ్దకాలం యావత్తూ వృద్ధిరేటు చాలా ఎక్కువగా జరిగినట్టు లెక్క వస్తుంది. అందుచేత సరైన అంచనాలకు రావడానికి వీలుగా నేను 1961 నుంచీ గడిచిన కాలంలో బాగా ఎక్కువ వృద్ధిరేటు సాధించిన సంవత్సరాలను ఎంచుకున్నాను. ఆ విధంగా చూసినప్పుడు 1961, 1973, 1984, 1997, 2007, 2018 సంవత్సరాలలో అత్యధిక వృద్ధిరేటు జరిగినట్టు తేలింది. ఇప్పుడు వీటిలో ప్రతీ రెండింటి మధ్య కాలంలోని వృద్ధిరేటును పరిశీలించాను. ఆ రేట్లు ఈ విధంగా (పట్టిక) ఉన్నాయి.పట్టికలోని అంకెలను బట్టి మూడు నిర్ధారణలు చేయవచ్చు. మొదటిది: మొత్తంమీద చూసినప్పుడు ప్రభుత్వాల నియం త్రణలో దేశాల ఆర్థిక వ్యవస్థలు నడిచినప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు నయా ఉదారవాద కాలంలోని వృద్ధిరేటు కన్నా చాలా ఎక్కువగా ఉంది. "మార్కెట్టే సర్వ శక్తి సంపన్నం" అంటూ ఇప్పుడు జరుగుతున్న చర్చల్లో నయా ఉదారవాద కాలంలోనే జిడిపి వృద్ధిరేటు బాగా ఎక్కువగా ఉందన్న అభిప్రాయం కలుగుతుంది. ఈ అభిప్రాయం పూర్తిగా తప్పు. వాస్తవానికి నయా ఉదారవాద కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు గణనీయంగా మందగించింది.రెండవది: ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థలు నడిచిన కాలానికి, నయా ఉదారవాద విధానాలు అమలు కావడం మొదలైన నాటికి మధ్య కొంత వ్యవధి ఉంది. ఈ కాలంలో వృద్ధిరేటు 5.4 శాతం నుండి 2.9 శాతానికి పడిపోయింది. 1967 నుండి ద్రవ్యోల్బణం వేగవంతం అయి 1973–74 వరకూ కొనసాగింది. దానిని అదుపు చేయడానికి పెట్టుబడిదారీ వర్గం ప్రభుత్వ వ్యయాన్ని కుదిస్తూ, భారీ స్థాయిలో నిరుద్యోగాన్ని పెంచే వ్యూహాన్ని అనుసరించింది. ఈ వ్యూహం ఫలితంగా 1973 నుంచీ వృద్ధిరేటు మందగించింది. అప్పటి నుంచీ దేశాల ఆర్థిక వ్యవస్థల మీద ప్రభుత్వాల నియంత్రణ ఉండే విధానం నిలిచిపో యింది. ఇలా వృద్ధిరేటు మందగించిపోవడం నయా ఉదారవాద విధానాలను ప్రవేశపెట్టడానికి కావలసిన భూమికను కల్పించింది. అప్పటికే పెరుగుతూ అంతకంతకూ అంతర్జాతీయ స్వభావాన్ని సంతరిం చుకుంటున్న ద్రవ్య పెట్టుబడి అంతకు ముందునుంచే నయా ఉదారవాద విధానాలకు మళ్ళాల్సిందేనంటూ ఒత్తిడి పెంచుతోంది. సరిగ్గా ఆ సమయానికే పాత విధానాల పర్యవసానంగా ముందు ద్రవ్యోల్బణం, తర్వాత వృద్ధిరేటు మందగించడం జరిగాయి. మూడవది: పైన ఇచ్చిన అంకెలను చూస్తే అమెరికాలో హౌసింగ్ బుడగ పేలిపోయిన అనంతర కాలంలో వృద్ధిరేటు మందగమనం కొనసాగుతూనే వుంది. హౌసింగ్ బుడగ బద్దలైపోవడంతో పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తంగా సంక్షోభంలో పడింది. అప్పుడు ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున జోక్యం చేసుకుంది (ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వాల జోక్యం ఉండరాదనే నయా ఉదారవాదం బండారం దీనితో బైటపడింది). కాని వాస్తవ ఆర్థిక వ్యవస్థకు దాని నుంచి ఎటువంటి ప్రేరణా లభించలేదు. వృద్ధిరేటును పెంచడానికి ప్రభుత్వాల వ్యయం పెరగడం గాని, హౌసింగ్ బుడగ వంటి మరేవైనా బుడగలు ఏర్పడి తాత్కాలికంగా వృద్ధిరేటు వేగాన్ని పెంచడానికి దోహదం చేయడం వంటివి కాని జరగలేదు. మనం 2018 సంవత్సరాన్ని ఆఖరి గరిష్ట వృద్ధి సంవత్సరంగా తీసుకున్నాం. ఆ తర్వాత చూస్తే వృద్ధిరేటు మరీ అన్యాయంగా పడిపోయింది. 2018 నుంచి 2022 మధ్య వృద్ధిరేటు సాలుకు 2.1 శాతం మాత్రమే ఉంది. ప్రపంచ జనాభా వృద్ధిరేటు సుమారు 1 శా తంగా ఉంది (మన దేశ జనాభా లెక్కలు 2021లో సేకరించి వుండా ల్సింది. కాని ఇంతవరకూ ఆ పని ప్రారంభం కానేలేదు.). దీనిని పరిగణనలోకి తీసుకుంటే ప్రపంచ తలసరి ఆదాయం ఒక శాతం చొప్పున మాత్రమే పెరుగుతున్నట్టు భావించాలి. ఐతే, ప్రపంచంలో ఆదాయాల మధ్య అసమానతలు బాగా పెరుగుతున్నాయి. దానిని బట్టి ప్రపంచ జనాభాలో అత్యధిక మెజారిటీ ఆదాయాలలో పెరుగుదల లేకుండా స్తంభించిపోవడం కాని తరిగిపోవడం కాని జరుగుతోంది. దీనిని వివరించడానికి దిగువ విషయాన్ని ఉదహరిస్తాను. ప్రపంచ ఆదాయం మొత్తంలో సగభాగం కన్నా ఎక్కువ జనాభాలోని అత్యంత సంపన్నులైన 10 శాతం ప్రజలు పొందుతున్నారు. వీరి ఆదాయాలు ఏటా కనీసం 2 శాతం చొప్పున పెరుగుతున్నాయనుకుంటే అప్పుడు తక్కిన 90 శాతం మంది ఆదాయాలూ ఏ పెరుగుదలా లేకుండా స్తంభించిపోయినట్టే కదా. అంటే నయా ఉదారవాదం చివరి దశలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ జనాభాలో అత్యధిక ప్రజానీకపు ఆదాయాలు పెరుగుదల లేకుండా స్తంభించిపోయేట్టు చేసిందని స్పష్టం అవుతోంది. ఇది పాత వలస పాలనా కాలాన్ని గుర్తుకు తెస్తోంది. అప్పుడు కూడా ప్రపంచంలోని అత్యధిక శాతం ప్రజల నిజ ఆదాయాలు పెరగకపోగా తరిగిపోయాయి. ఇలా వృద్ధిరేటు మందగించడం అనేది కొద్ది కాలంపాటు మాత్రమే ఉండే తాత్కాలిక సమస్య అని, త్వరలోనే దీనిని అధిగమిస్తామని అనుకోలేం. ఈ పరిస్థితి నయా ఉదారవాద విధానాల పర్యవసానమే. ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటు పెరగాలంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ పెరగాలి.

# వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద వితరణ







**కుషాయిగూడ, జూలై 24, (తెలంగాణ దిశ) :** వాసవి మిత్ర మండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలోని సాయిబాబా మందిర్ ప్రాంగణంలో గురువారం అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. వి3న్యూస్ చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పెద్ది మౌనిక, నిఖిల్ గుప్తా దంపతులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి చేయూత నిచ్చారు. అనంతరం కుషాయిగూడకు చెందిన పేద వృద్ధురాలు మాలే వరమ్మ, కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి, పడకంటి కమలమ్మలకు ఈనెల పెన్షన్ కింద ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున నలుగురికి అందజేశారు ఈ కార్యక్రమంలో వాసవి మిత్ర మండలి జిల్లా అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్త, కార్య నిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్త, ఉపాధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్త, కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్త, అమర కృష్ణ గుప్త, చందా సంతోష్ గుప్త, కార్యవర్గ సభ్యులు ఉప్పల ఆంజనేయులు గుప్త, మిర్యాల అరుణ్ కుమార్ గుప్త, ఏనిశెట్టి రమేష్ గుప్త, రాయి కంటి వేణు గుప్త, సభ్యులు రాయల శ్రవణ్ గుప్త, పెద్ది శ్రీనివాస్ గుప్త, పెద్ది నవీన్ గుప్త, నీలా శివకుమార్ గుప్త, కొకలా కృష్ణమూర్తి గుప్త, పొద్దుటూరి వెంకటేశ్వర్లు గుప్త, రాజూరి జగదీష్ గుప్త, కండే శివగుప్త చంద్రగిరి తారకేశ్వర్ గుప్త, అర్థం శ్రీనివాస్ గుప్త, కోడూరి లక్ష్మణ్ గుప్త, విబివి కృష్ణ గుప్త, బుస్స శ్రీనివాస్ గుప్త, రవ్వ ఈశ్వరరావు గుప్త, పసునూరి వెంకటేశం గుప్త, దాచా ప్రసాద్ గుప్త, గజ్జల రమేష్ గుప్త, గుబ్బ రామచంద్ర గుప్తా పొద్దుటూరి శ్రీధర్ గుప్త, బెలిదే భగవాన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి

## - మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా




**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 24, (తెలంగాణ దిశ) :** చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధికా గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమం (ఆర్ బిఎస్ కె) బృందాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, వారి పూర్తి సామర్థ్యాన్ని సాధించడానికి ఉద్దేశించిన ఆర్ బిఎస్ కె కార్యక్రమంలో భాగంగా పిల్లలు పుట్టినప్పటి నుండి 18 సంవత్సరాల వయస్సు గల వారిని లక్ష్యంగా చేసుకుని పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, అభివృద్ధి జాప్యాలు వంటి వాటిని ముందస్తుగా గుర్తించి చికిత్స చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో జరుగుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ప్రత్యక్ష సమస్యలు, వారి అనుభవాలను పంచుకుంటూ, సమన్వయంతో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ సూచించారు.

జిల్లాలోని ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండేలా కృషి కొనసాగించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సి. ఉమాగౌరి జిల్లాలో పనిచేస్తున్న ఆర్ బిఎస్ కె బృందాల నిర్మాణం, విధులు, రోజువారీ కార్యాచరణ గురించి అదనపు కలెక్టర్‌కు వివరంగా వివరించారు. అనంతరం అంగన్‌వాడీ, ఆరోగ్య స్క్రీనింగ్, కంటి పరీక్షలు, వికాస ఆలస్యం గుర్తింపుపై సమీక్ష నిర్వహించారు. డిఈఐసి నిలోఫర్ ఆసుపత్రికు రిఫరైన కేసుల సంఖ్య, ప్రస్తుతం చికిత్స పొందుతున్న కేసులు, ఫాలోఅప్ ప్రక్రియను అధికారులు వివరించారు.

క్షేత్ర స్థాయిలో చికిత్స సేవలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టంచేశారు. ఈ సమీక్షలో కీసర, మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ డీఎం హెచ్ఓలు డాక్టర్ శోభా, డాక్టర్ డాక్టర్ సత్యవతి, జిల్లా టీకా అధికారి డాక్టర్ వి. కౌశిక్,ఆర్ బిఎస్ కె టీమ్ సభ్యులు, వైద్య అధికారులు, ఫార్మసిస్టులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించాలి..

### సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

### జిహెచ్ఎంసి జాయింట్ కమిషనర్ ఎన్. శంకర్



**మల్లాపూర్,జూలై 25, (తెలంగాణ దిశ):** వర్షాకాలం సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా ప్రబలుతున్న నేపథ్యంలో మలేరియా సిబ్బంది విధులను జిహెచ్ఎంసి జాయింట్ కమిషనర్ ఎన్. శంకర్ పరిశీలించారు. ఇందులో భాగంగా గురువారం మల్లాపూర్ దత్తాత్రేయ నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న ఎంటమాలజీ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రతి ఇంటి పరిసర ప్రాంతాలలోని నీటి నిల్వలను పరిశీలిస్తూ ఇంటి యజమానులకు సీజనల్ వ్యాధుల తోపాటు సేకరించిన లార్వాపై అవగాహన కల్పించాలని సూచించారు.ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి అవగాహన కల్పించాలన్నారు. ఉదయం పూట కుట్టే ఏడీస్ దోమ వల్ల డెంగు వ్యాధి వ్యాపిస్తుందని అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఎంటమాలజీ ఏఈ డి. రమేష్, సూపర్ వైజర్ కనకరాజు, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సారాంశం సులువుగా అర్థమయ్యే విధంగా బోధించాలి

## మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



**మేడ్చల్ కలెక్టరేట్ జూలై 24, (తెలంగాణ దిశ):** విద్యార్థులు ఇష్టంగా చదువుకుని మంచి ఫలితాలను సాధించాలని, అందుకు అవసరమైన వసతులను కల్పిస్తామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. గురువారం శామీర్ పేట్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యా శాఖాధికారి విజయ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, తరగతి గదులు ఎన్ని ఉన్నాయని హెడ్ మాస్టర్ ను అడిగారు. అదనపు తరగతి గదులు, టాయిలెట్లు అవసరమని హెడ్ మాస్టర్ తెలుపగా, ఇంజనీర్లతో అంచనాలు వేయించి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. అనంతరం సిలబస్ ఎంత వరకు పూర్తయిందని, భోజనం ఎలా ఉంటుందని హెడ్ మాస్టర్ అడిగినవి కాకుండా ఇంకేమైన మీకు సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను కలెక్టర్ అడిగారు.

అన్ని సౌకర్యాలు బాగున్నాయని, మధ్యాహ్న భోజనం కూడా బాగుంటుందని విద్యార్థులు సమాధానమిచ్చారు. కలెక్టర్ పాఠశాలనంతా కలియ తిరిగి పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించారు. విద్యార్థులకు అర్థం కాకుండా గంటల తరబడి తరగతులు తీసుకోవడం కంటే వారికి సులువుగా సారాంశం అర్థమయ్యేలా ఎలా చెప్పాలనే అంశాలను గ్రహించాలని టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, మున్సిపల్ కమీషనర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కాప్రా చెరువు సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

## జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి సాయని



**కాప్రా, జూలై 24, (తెలంగాణ దిశ) :** కాప్రా చెరువు నీటి వనరుల సంరక్షణ కోసం జిహెచ్ఎంసి రెవెన్యూ, ఇరిగేషన్ సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి సాయిని సూచించారు. గురువారం కాప్రాలోని ఆమె నివాసంలో జిహెచ్ఎంసి ఎల్ బి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, తహసిల్దార్ సుచరిత, కుషాయిగూడ ఏసిపి వెంకట్ రెడ్డి, సీఐ భాస్కర్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులతో కాప్రా చెరువు సంరక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కాప్రా చెరువును సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. చెరువు రక్షణకు తీసుకోవలసిన అంశాలను పరిశీలించారు. కాప్రా చెరువు పరిసర ప్రాంతాలలో గంజాయి, మద్యం సేవించడం వంటి కార్యకలాపాలను నివారించడానికి పోలీస్ పెట్రోలింగ్ చేపట్టాలని కుషాయిగూడ ఏసిపి వెంకట్ రెడ్డి, సీఐ భాస్కర్ రెడ్డికి సూచించారు.



# నెలా నెలా చెల్లిస్తాం



**హైదరాబాద్, తెలంగాణ దిశ :** కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చింది. ప్రజలకు మాత్రమే కాదు.. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా అనేక వరాలు ప్రకటించింది. అధికారంలోకి వచ్చి ఈ ఏడాది దాటిపోయినప్పటికీ హామీల గురించి ప్రభుత్వం పెద్దగా దృష్టి సారించినట్టు కనిపించలేదు. ప్రతినెల ఒకటో తారీకు ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నప్పటికీ? మిగతా వాటి విషయంలో మాత్రం ప్రభుత్వం ఆ తరహాలో ఉదారత చూపించలేదు.ప్రతినెల ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు.. అంతకుముందు ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రభుత్వపరంగా రావాల్సిన బెనిఫిట్స్ పెండింగ్లో ఉన్నాయి. దాదాపు ఇవి ఎనిమిది వేల కోట్ల వరకు ఉంటాయని తెలుస్తోంది. తమకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం విశ్రాంత ఉద్యోగులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇక ఉద్యోగులు తమకు రావాల్సిన బిల్లుల మంజూరు చేయాలని సంబంధిత ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ క్రమంలో ట్రెజరీ ల మీద ప్రభుత్వం అనధికారిక ఆంక్షలు విధించడంతో బిల్లులు మంజూరు చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు.. విశ్రాంత ఉద్యోగులు ప్రభుత్వంపై నిరసన స్వరం వినిపించడం మొదలుపెట్టారు. విమర్శలు చేయడం మొదలుపెట్టారు. ఈ విషయాన్ని భారత రాష్ట్ర సమితి.. భారతీయ జనతా పార్టీ ప్రముఖంగా ప్రస్తావిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. దీంతో కీలక నిర్ణయం తీసుకుంది. పెండింగ్ బిల్లులు.. బకాయిల గురించి రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఉద్యోగుల జేఏసీ ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ముందు ఏకరవు పెట్టింది. ఈ సందర్భంగా వాళ్ల సమస్యలను భట్టి సావధానంగా విన్నారు. " పెండింగ్ బిల్లులు అలాగే ఉన్నాయి. పదవి విరమణ చేసిన ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. మిగతా బిల్లులు కోసం ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ఉదారత చూపించాలి. బిల్లులు మంజూరు కాకపోవడంతో ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని" ఉద్యోగుల జేఏసీ నాయకులు భట్టి విక్రమార్క ఎదుట వాపోయారు. వారు చెప్పిన విషయాలను విన్న భట్టి విక్రమార్క.. గుడ్ న్యూస్ చెప్పారు. " మాది స్నేహపూర్వక ప్రభుత్వం. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు మాకు తెలుసు. ఎన్నికల ముందు మేము ఇచ్చిన హామీలు గుర్తుకే ఉన్నాయి. వాటిని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కాస్త ఇబ్బందికరంగా ఉంది. ఆయనప్పటికీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో రాజీపడేది లేదు. వచ్చే ఏప్రిల్ నుంచి ప్రతినెల 500 నుంచి 600 కోట్ల చొప్పున ఉద్యోగులకు సంబంధించిన 8,000 కోట్ల పెండింగ్ బకాయిలను చెల్లిస్తాం. ఇకపై కొత్త బకాయిలు లేకుండా చూస్తాం. ఉద్యోగులు బకాయిల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ఆర్థికేతర విషయాలను సబ్ కమిటీలో చర్చించి పరిష్కరిస్తాం. ఉద్యోగుల సంబంధించిన ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తాం. ఉద్యోగుల నియామక ప్రక్రియలలో ఎటువంటి ఆలస్యం లేకుండా చూస్తాం. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేస్తామని" భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దీంతో ఉద్యోగుల జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కొంతకాలంగా ప్రభుత్వంపై ఉద్యోగులు ఆగ్రహంగా ఉన్న నేపథ్యంలో.. భట్టి విక్రమార్క చేసిన ప్రకటన వారిలో సంతోషాన్ని నింపుతోంది

# జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణకు అధిక ప్రాధాన్యం



మహబూబ్ నగర్,: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. రోడ్లు ఉంటే అభివృద్ధి జరుగుతుందన్న ఉద్దేశంతో రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులు వెచ్చిస్తోంది. ఇప్పటికే వేల కిలోమీటర్ల నిర్మాణం జరిగింది. తాజాగా తెలంగాణలో భూగర్భ మార్గం నిర్మాణంపై దృష్టి పెట్టింది.నుంచి శ్రీశైలం వరకు ప్రస్తుతం ఉన్న రహదారి సుమారు 213 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ మార్గంలో ప్రయాణ సమయం సాధారణంగా 5 నుంచి 6 గంటలు పడుతుంది. ఈ రహదారి నల్లమల్ల అడవులు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ గుండా వెళుతుంది, ఇక్కడ రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు రాకపోకలు నిషేధించబడతాయి. ఈ పరిమితులు, రహదారి పరిస్థితులు. భద్రతా సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ఈ మార్గాన్ని మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలను పరిశీలిస్తోంది.మార్గంలో ఒక భూగర్భ మార్గం నిర్మించే ఆలోచన గురించి చర్చలు జరుగుతున్నాయి. ఈ ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. అయితే, ఈ ఆలోచన వెనుక ఉన్న కొన్ని సాధ్యమైన కారణాలు ఇలా ఉన్నాయి.: భూగర్భ మార్గం ద్వారా దూరం మరియు సమయం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు. ప్రస్తుత 5?6 గంటల ప్రయాణం 3?4 గంటలకు తగ్గే అవకాశం ఉంది.నల్లమల్ల అడవుల్లో వన్యప్రాణులు, రాత్రి పూట రాకపోకల నిషేధం వంటి సమస్యలను నివారించవచ్చు.పర్యాటకం, కనెక్టివిటీ: శ్రీశైలం ఒక ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో, ఈ మార్గం ద్వారా పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.: అడవుల గుండా రహదారులు విస్తరించడం కంటే భూగర్భ మార్గం పర్యావరణానికి తక్కువ హాని కలిగించవచ్చు.

భూగర్భ మార్గంతోపాటు, హైదరాబాద్?శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం గురించి కూడా చర్చలు జరుగుతున్నాయి. ఈ ఎలివేటెడ్ కారిడార్ 62 కిలోమీటర్ల పొడవుంటుందని, దీని నిర్మాణ వ్యయం సుమారు రూ. 7,700 కోట్లుగా అంచనా వేయబడింది. ఈ ప్రాజెక్ట్లో ఒక ఐకానిక్ బ్రిడ్జ్ కూడా భాగంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ రెండు ప్రతిపాదనలు (భూగర్భ మార్గం మరియు ఎలివేటెడ్ కారిడార్) ఒకదానికొకటి పూరకంగా లేదా ప్రత్యామ్నాయంగా పరిగణించబడుతున్నాయా అనేది ఇంకా స్పష్టంగా తెలియలేదు. భూగర్భ మార్గం నిర్మాణం అనేది సాంకేతికంగా సవాలుతో కూడుకున్నది. నల్లమల్ల కొండలు, భౌగోళిక పరిస్థితులు దీన్ని సంక్లిష్టంగా మార్చవచ్చు.ఎలివేటెడ్ కారిడార్కే రూ. 7,700 కోట్లు అంచనా వేస్తుంటే, భూగర్భ మార్గం ఖర్చు ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇటువంటి పెద్ద ప్రాజెక్టులకు సంవత్సరాల సమయం, పర్యావరణ అనుమతులు, భూసేకరణ వంటివి అవసరం. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వరకు భూగర్భ మార్గం ఒక సాహసోపేతమైన ఆలోచనగా ఉన్నప్పటికీ, ఇది ఇంకా ప్రణాళిక దశలోనే ఉంది. ప్రస్తుతానికి, ఈ మార్గంలో ప్రయాణం కోసం జాతీయ రహదారి 765 రహదారి మాత్రమే అందుబాటులో ఉంది.

## ఫ్రీ బస్సు పథకం.. జిల్లాకే పరిమితం

నెల్లూరు, : కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం పై ఇచ్చిన మాటను తప్పనుందా?, తెలంగాణ లో ఈ పథకం కారణంగా ప్రభుత్వం పై తీవ్రమైన నెగిటివిటీ రావడాన్ని చూసి , మెల్లగా ఈ పథకానికి పంగనామాలు పెట్టే ప్రయత్నం చేస్తుందా?, నేడు మంత్రి గుమ్మడి సంధ్య రాణిశాసన మండలి లో చెప్పుకొచ్చింది. ఆమె మాట్లాడుతూ 'ఉచిత బస్సు పథకం ఏ జిల్లాకు సంబంధించిన మహిళలు, ఆ జిల్లాలో పర్యటించడానికి మాత్రమే. ఒక జిల్లా నుండి మరో జిల్లాకు పర్యటించడానికి కాదు, అలా మేము ఎప్పుడూ చెప్పలేదు' అంటూ ఆమె చెప్పుకొచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ఇలా చేయలేదు. మహిళలకు తెలంగాణ లో ఒక చోట నుండి మరో చోటకు ఎక్కడికి వెళ్లినా ఉచితమే. దీని వల్ల లాభాలు కంటే నష్టాలే ఎక్కువ జరిగాయి. ఆటో కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయి.అందుకే పథకం ఎప్పటి నుండి అమలు చేయబోతున్నారు అనే దానిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ ఈ పథకం పై ప్రభుత్వం విధి విధానాలు ఎలా ఉండబోతుందో ఈరోజు మంత్రి వ్యాఖ్యలతో అర్థం అవుతుంది. సూపర్ 6 లో ప్రస్తుతం సామాజిక పెన్షన్ పెంపు, ఉచిత గ్యాస్ పథకాలు అమలు అయ్యాయి. మిగిలిన పథకాలలో అత్యంత కీలకమైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటివి మే నెల నుండి ప్రారంభించబోతున్నట్టు ఇప్పటికే అసెంబ్లీ లో పలు మార్లు కూటమి నేతలు అధికారికంగా ప్రకటించారు. మరి ఎంతమేరకు ఈ పథకాలను అమలు చేస్తారు?, ఇచ్చిన మాట మీద నిలబడుతారా లేదా అనేది చూడాలి. ఆరు నెలలు జనాలు కూడా ఈ పథకాల గురించి అడగలేదు. కొత్త ప్రభుత్వం కదా, కాస్త సర్దుకోవాలి అనే ఉద్దేశ్యంతో ఉన్నారు. కానీ ఆరు నెలల తర్వాత ఈ పథకాలు గురించి అడగడం మొదలు పెట్టారు, జనాల్లో నెగటివిటీ పెరిగింది.ఉచిత బస్సు ప్రయాణం పై ప్రభుత్వం మీద గట్టి ఒత్తిడి జనాలు చేయడం లేదు కానీ, 'తల్లికి వందనం' పథకం పై మాత్రం చాలా గట్టి ఒత్తిడి చేస్తున్నారు. ఎందుకంటే మాజీ సీఎం జగన్, ప్రభుత్వాన్ని స్థాపించిన ఆరు నెలలకు ఈ పథకాన్ని ప్రారంభించాడు. కానీ కూటమి ప్రభుత్వానికి ఆరు నెలలు దాటి 9 వ నెలలోకి అడుగుపెడుతుంది. బడ్జెట్ లో ఈ పథకానికి 9 వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయించారు. మే నెలలో ఒక కుటుంబం లో ఎంతమంది అమ్మాయిలు ఉంటే అంత మందికి 15 వేల రూపాయిలు ఇస్తామంటూ చెప్పుకొచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ పథకాన్ని అమలు చేస్తే కూటమి కి తిరుగు ఉండదు. చేయకపోతే మాత్రం ఘోరమైన నెగటివిటీ ని ఎదురుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రమైన నెగటివిటీ ఉందని రీసెంట్ గా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా అందరికీ అర్థమైంది, కూటమి ప్రభుత్వం ఆ స్థాయికి వెళ్లకుండా జాగ్రత్త పడుతుందో లేదో చూడాలి.

# బీసీ హాస్టళ్లకు మహర్దశ..

**ఖమ్మం, తెలంగాణ దిశ :** ఖమ్మం జిల్లాలో బీసీ విద్యార్థులకు మహర్దశ పట్టనుంది. శిథిలావస్థలో ఉన్న బిసి వెల్ఫేర్ హాస్టల్స్ స్థానంలో నూతన భవనాల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో ఖమ్మంలో మూడు బీసీ వెల్ఫేర్ హాస్టల్ భవనాలను మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో భవనానికి రూ. 3 కోట్ల చొప్పున మొత్తం మూడు భవనాలకు రూ. 9 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది.ఒక్కో భవనాన్ని అత్యాధునిక హంగులతో నిర్మించనున్నారు. ఖమ్మం నియోజకవర్గంలో శిథిలావస్థలో ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి ఎనలేనిది. హాస్టల్స్ శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు విద్యార్థుల అవస్థలను గమనించిన మంత్రి నూతన భవనాలకు ప్రభుత్వానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు ఖమ్మం నియోజకవర్గంలో మూడు బీసీ వెల్ఫేర్ హాస్టల్ నిర్మాణానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. తొమ్మిది కోట్ల వ్యయంతో ఈ మూడు భవనాలను నిర్మించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.రఘునాథపాలెం మండలం వి. వెంకటాయ పాలెంలో బిసి బాయ్స్ హాస్టల్స్, ఖమ్మం నగరంలోని ముస్తఫా నగర్ లో గల బీసీ బాయ్స్ హాస్టల్-1, ఖమ్మం నగరంలోని జహీర్ పురాలోని బీసీ బాయ్స్ హాస్టల్-2 కు నూతన భవనాలు మంజూరయ్యాయి. ఈ మూడు భవనాలను ఆధునిక హంగులతో సరికొత్త సాంకేతిక పద్ధతులతో నిర్మించనున్నారు. వీటి నిర్మాణానికి

మంత్రి తుమ్మల త్వరలో శంకుస్థాపన చేయనున్నారు. నూతన భవనాల నిర్మాణంతో బీసీ విద్యార్థులకు కష్టాలు తీరనున్నాయి. ఇప్పటికే నూతన మెనూ తో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో సాంకేతిక హంగులతో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని వీటి నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు చేస్తున్నారు. బీసీ విద్యార్థుల అభ్యున్నతికి ప్రగతి బాటలు వేసేలా మంత్రి 'తుమ్మల'కృషి చేయనున్నారు.

## భార్యపై హత్యాయత్నం చేసిన భర్త

**తిరుపతి, తెలంగాణ దిశ :** పెళ్లకూరు మండలం టెంకాయతోపు గుర్రపుతోటలో దారుణం జరిగింది. భార్య లక్ష్మిప్రియను అతి కిరాతకంగా స్క్రూడ్రైవర్తో భర్త హేమంత్ పొడిచాడు. లక్ష్మిప్రియ కేకలు విని స్థానిక యువకులు అక్కడికి చేరుకోవడంతో భర్త హేమంత్ పరారయ్యాడు. శ్రీ కాళహస్తి కి చెందిన హేమంత్ కుమార్ అనే యువకుడు కడప జిల్లా రైల్వే కోడూరు చెందిన లక్ష్మి ప్రియ ను ప్రేమించి పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్నాడు. హేమంత్ కుమార్ పెళ్లైన కొద్ది రోజుల నుండే లక్ష్మి ప్రియాను కట్నం డబ్బులు కోసం వేధించడం మొదలుపెట్టాడు. పలుమార్లు లక్ష్మిప్రియపై దాడి చేసి కట్నం డబ్బులు తెస్తావా తేవా లేకుంటే నేను ఇంట్లో నుంచి తరిమేస్తానని కొట్టడంతో తన తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి అక్కడే ఉంటుంది.వివాహమైన సంవత్సరానికి మగ బిడ్డకు జన్మనిచ్చిన లక్ష్మిప్రియపై భర్త హేమంత్ కుమార్ అనుమానం పెంచుకున్నాడు. నాలుగు నెలల క్రిందట భార్య వద్దకు వెళ్లి నిన్ను బాగా చూసుకుంటాను నాతో వచ్చేయి మనం వేరు కాపురం ఉందామని చెప్పి కాళహస్తిలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు.ఈ క్రమంలో రెండు రోజుల క్రితం భార్యభర్తల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో భార్యపై దాడి పాల్పడ్డాడు.దాడిలో గాయపడిన భార్యను ఆసుపత్రికి తీసుకెళ్తానని నమ్మబలికించి పెళ్లకూరు మండలం టెంకాయతోపు వద్దకు తీసుకు వచ్చి ఆ మహిళపై అత్యంత కిరాతకంగా స్క్రూడ్రైవర్తో పొడిచి కత్తితో దాడి చేశాడు. దాడి చేస్తున్న సమయంలో అటుగా వెళుతున్న నలుగురు యువకులు గమనించి ఆ మహిళను కాపాడారు. ఈ క్రమంలో నిందితుడు హేమంత్ అక్కడి నుంచి పరారైయ్యాడు. ప్రేమించి నమ్మబలికి ప్రేమ వివాహం చేసుకున్న ఆ మహిళపై అత్యంత కిరాతకంగా దాడి చేయడంతో ప్రస్తుతం ఆస్పత్రిలో ఆ మహిళ చికిత్స పొందుతుంది.



# ప్రకృతి ఒడిలో వట్టెం వెంకటేశ్వర స్వామి

బిజినేపల్లి: నాగర్కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం అడ్డగట్టుపై ప్రకృతి బడిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయం1978-1981 మధ్య కాలంలో గుడ్లనర్వకు చెందిన నర్సింహారావు వట్టెం శివారులోని అడ్డగట్టుపై కుసుమ,హరినాథ్ ఆశ్రమం నిర్మించుకొని కొండపై వెంకన్న ఆలయాన్ని నిర్మించా లని కోరుకున్నాడు.పురాతన విగ్రహాన్ని ఆసరాగా చేసుకొని ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేయాలని సంకల్పించుకున్నారు. వట్టెం గ్రామస్తులైన సందడి రంగా రెడ్డి 1983లో సివిల్ ఇంజినీర్ గా పనిచేసి ఆనం తరం వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించాలనే కోరిక ఉండేది.కాగా1983లో వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టారు.1985 నుంచి రంగారెడ్డి శేష జీవితమంతా భగవంతుడి సేవ కోసం అంకితం చేశారు.1986, మేలో వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.అప్పటినుంచి ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ పేదల తిరుపతిగా పేరుగాంచింది.1988లో ఆలయ ప్రాంగ ణంలో కల్యాణమండపాన్ని నిర్మించారు. 1994లో నాటి ముఖ్యమంత్రి కోట్ల విజయాస్కరెడ్డి ధ్యానమందిరానికి శంకుస్థాపన చేశారు.అనంతరం వరాహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు.1999 లో నాగర్ కర్నూలు చెందిన సుబ్బారెడ్డి వాస ఈశ్వరయ్య హకీం మురళి సహకారంతో నిత్యాన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేశారు.అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో ఆంజనేయుడు, గరుడపక్షి విగ్ర హాలు,వసతిగృహాలు, రోడ్లు,రేకులషెడ్లు నిర్మించారు.2021లో రామానుజాచార్యుల విగ్రహాన్ని అనంత నర్సింహారెడ్డి,సుకన్య ఆర్థికసాయంతో ఏర్పాటు చేశారు.మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నిధులతో గోశాల, శ్రీకృష్ణ, గోమాత విగ్రహాలను ఏర్పాటు చేశారు. అలాగే అద్దాలమేడ, ధ్యాన మందిరం, ముఖద్వారం నిర్మించారు. 1999లో 12ఏండ్లకు ఒకసారి పుష్కరో త్సవం నిర్వహించారు. 2011లో ద్వితీయ పుష్కరోత్సవాన్ని నిర్వహించారు.

## కన్నడ మంత్రికి రన్యారావుతో లింక్..?

బెంగళూరు : బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తూ నటి రన్యా రావు అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఈ అంశంపై కర్ణాటక అసెంబ్లీలో రచ్చ రచ్చ జరిగింది. అక్రమ రవాణా కేసులో అరెస్ట్ అయిన నటి రన్యా రావు వెనుక ఉన్న మంత్రి ఎవరే విషయంపై తీవ్ర కలకలం రేగింది. ఆమె వెనుక ఉన్నది ఎవరో బహిర్గతం చేయాలంటూ సభలోని బీజేపీ ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో కొద్ది సేపు తీవ్ర గందరగోళం చోటు చేసుకుంది. ఈ కేసు గురించి తనకు ఎటువంటి సమాచారం లేదని హోంమంత్రి చెప్పడంతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు మండిపడ్డారు. నటి రన్యా రావు కేసుకు సంబంధించి, బంగారం స్మగ్లింగ్ వెనుక ఉన్న మంత్రి ఎవరు? అని బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ సభలో ప్రశ్న లేవనెత్తారు. అయితే ఈ ప్రశ్నకు సమాధానం చెబుతూ.. హోంమంత్రి పరమేశ్వర తనకు తెలియదని చెప్పడంతో ఒక్కసారిగా సభలో వివాదం చెలరేగింది. అయితే సభలో మంత్రి ఎవరో చెప్పకపోయినా.. బంగారం అక్రమ రవాణా వెనుక బడా నేత ఉన్నట్లు సమాచారం. ఆదివారం ఈ కేసు వెనుక మంత్రి ఉన్నారని బీజేపీ నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. సోమవారం కూడా ఇదే అంశం సభలో లేవనెత్తడంతో గందరగోళం చోటు చేసుకుంది. అసెంబ్లీ జీరో అవర్ సందర్భంగా ఈ అంశాన్ని లేవనెత్తిన కర్కల బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, బంగారం అక్రమ రవాణాకు పోలీసులే ప్రోటోకాల్ ఇచ్చారని అనుమానం వ్యక్తం చేశారు. దీని వెనుక మంత్రి ఎవరో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. దీనిపై హోంమంత్రి పరమేశ్వర్ స్పందిస్తూ.. ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని అన్నారు.ఈ కేసు గురించి మీకు ఎంత తెలుసో, తమకూ అంతే తెలుసని అన్నారు.

# ప్రశ్నార్థకంగా మారిన ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు!

**నాగర్ కర్నూలు, తెలంగాణ దిశ :** దక్షిణ తెలంగాణాలో పాలమూరు, నల్గొండ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు త్రాగునీరు అందించే బహుళార్ధ సాధక ప్రాజెక్ట్ ఎస్ ఎల్ బి సి (శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గం) భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. పద్దెనిమిది రోజుల క్రితం టన్నెల్ కూలిన ప్రమాద ఘటనలో ఒక మృతదేహం వెలికి తీయగా మరో ఏడుగురి ఆచూకీ ఇప్పటికి లభించలేదు. కేంద్ర,రాష్ట ప్రభుత్వాలు సంయుక్తంగా అత్యాధునిక సాంకేతికత వినియోగించి రెస్క్యూ చర్యలు చేపట్టినప్పటికి ఆశించిన ఫలితం రావడం లేదు.ఈ దుర్గటన పై ప్రజలు, ప్రతి పక్షాలనుండి భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నాగర్కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ టన్నెల్లో ఇటీవల జరిగిన ప్రమాదం రాష్ట్రాన్ని తీవ్రగ్భ్రాంతికి గురి చేసింది. ఫిబ్రవరి 22, 2025న ఉదయం 8:30 గంటల సమయంలో టన్నెల్ పైకప్పు కూలిపోవడంతో ఎనిమిది మంది కార్మికులు లోపల చిక్కుకుపోయారు.ఈ ఘటనపై ప్రభుత్వం, విపత్తు స్పందన బలగాలు, సైన్యం, సింగరేణి సంస్థలు తక్షణ చర్యలు చేపట్టాయి. సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయి. ప్రజలు, రాజకీయ నాయకులు ఈ ఘటనపై తమ స్పందనను భిన్నంగా వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సహాయక చర్యలను ప్రారంభించింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రోడ్లు భవనాలు శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.టన్నెల్లో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగాబయటకు తీసుకురావడానికిఅన్ని విధాలాప్రయత్నాలు చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం నుండి ఎన్డీఆర్ఎఫ్, నేవీ, జి పి ఆర్, సింగరేణి,స్పెషల్ డాగ్ స్కాడ్ ఇతర సాంకేతిక బృందాలను కేంద్రమంత్రి ఆదేశాలతో రప్పించారు.నిరంతర రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నప్పటికి టన్నెల్ లో కురుకుపోయిన మట్టి, బురద, నీటి ఉట ల కారణంగా సహాయక చర్యలకు అడ్డంకి గా మారింది.

విపక్షాల స్పందన: ప్రతిపక్ష పార్టీలు ఈ ఘటనపై ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. భారత రాష్ట్ర సమితి (ఃఖీూ) నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని, ప్రాజెక్టుల్లో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఈ ఘటనపై తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల కుటుంబాలు వారి కుటుంబ సభ్యులను సురక్షితంగా తిరిగి తీసుకు వచ్చేందుకు ప్రార్థనలు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రజలు సహాయక చర్యలను వేగవంతం చేయాలని,ప్రమాదానికి కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇప్పుడున్న పరిస్థితి: ఎస్ ఎల్ బి సి టన్నెల్ ప్రమాద ఘటన లో ప్రస్తుతం సహాయక చర్యలు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి.టన్నెల్లో మట్టి, బురద, నీరు భారీగా చేరడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. ర్యాట్ హోల్ మైనర్స్ బృందాలు సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు ప్రత్యేక వ్యూహాలతో పనిచేస్తున్నాయి. టన్నెల్ బోరింగ్ మిషన్ కూడా డామేజ్ అయ్యింది, ఇది సహాయక చర్యలను మరింత క్లిష్టతరం చేసింది.ఈ ప్రమాదం కారణంగా ప్రాజెక్టు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది.ప్రాజెక్ట్ భవిష్యత్తు పై నీలి నీడలు కమ్ముకున్నాయి. టన్నెల్లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులు

వివిధ రాష్ట్రాలకు చెందినవారు. ప్రభుత్వం వారి సురక్షిత రక్షణకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే జిపియర్, డాగ్ స్కాడ్, ర్యాట్ మాన్ హోలర్స్, సింగరేణి, ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాల సహాయంతో ఒక మృత దేహాన్ని వెలికి తీశారు. మిగిలిన వారి ఆచూకీ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు.టన్నెల్ లో కన్వేయర్ బెల్ట్ తెగిపోవడం,నీరు, మట్టి, బురద చేరడం సహాయక చర్యలకు ప్రధాన ఆటంకాలుగా నిలిచాయి. ఈ ప్రమాదం రాష్ట్రంలోని ప్రాజెక్ట్ ల భద్రతా ప్రమాణాలపై చర్చను రేకెత్తించింది. ప్రభుత్వం, రెస్క్యూ బృందాలు, సైన్యం, సింగరేణి సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. కానీ ఆశించిన ఫలితం మాత్రం దక్కలేదు.

# ప్రజా సంక్షేమం కోసమే కుల గణన: ఎమ్మెల్యే



**భువనగిరి, తెలంగాణ దిశ :** అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధి కోసమే సామాజిక కులగణనం చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎంపీ చామల్ కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం విజయవంతం చేసేందుకుప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆర్థిక సామాజిక పరిస్థితులను క్షుణ్ణంగా సేకరించి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వంనిర్ణయం తీసుకుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ,జిల్లా అధ్యక్షుడు అండేం సంజీవరెడ్డి ,తదితరులు పాల్గొన్నారు. నవంబర్ 11.00 ల నుంచి మధ్యాహ్నం 1.00ల వరకు విద్యుత్ వినియెగదారుల దినోత్సవ కార్యక్రమం భువనగిరి విద్యుత్ డివిజన్ ఆఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసినట్లు పట్టణ డివిజన్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులు తామెదురుకుంటున్న సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని ఆయన అన్నారు. ధరణి మాడ్యూల్స్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మినీ మీటింగ్ హాల్ లో జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్ లకు మార్గ నిర్దేశం చేశారు. ధరణి, మీసేవ, షాదిముబారక్, కల్యాణలక్ష్మి, ఓటరు నమోదు, పై రివ్యూ నిర్వహించడం జరిగింది.రెవిన్యూ యాంత్రాగం జరగకుండా , ప్రధాన భూమిక పోషించాలన్నారు. ధరణి మాడుల్స్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి క్లియర్ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వీరారెడ్డి, భువనగిరి ఆర్డి ఓ కృష్ణారెడ్డి చౌటుప్పల్ ఆర్డిఓ శేఖర్ రెడ్డి, మండలం తహసీల్దార్ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ రోజు యాదాద్రి భువనగిరి జిల్లా కొత్త కలెక్టర్‌ను జిల్లా రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ దిడ్డి బాలాజీ, డివిజన్ ఛైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి జిల్లా ఆఫీసులో కలిశారు. రెడ్ క్రాస్ అభివృద్ధి గూర్చి వివరించారు.

# ఇళ్లు ఇచ్చారు.. వసతులు మరిచారు



భూపాలపల్లి, తెలంగాణ దిశ :హాలు లేని నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి పంపిణీ చేశారు. గడిచిన ఎన్నికల ముందు పంపిణీ చేసిన ఇళ్లలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో చేసేది లేక కొందరు సొంతంగా తాగునీటి బోర్లు వేసుకున్నారు. రాత్రి సమయంలో ఇళ్లలోకి విష పురుగులు వస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి సమీపంలో 544 రెండు పడక గదుల ఇళ్లను ఎనిమిదేళ్ల క్రితం నిర్మించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో 60 ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి తలుపులు, కిటికీలు, పైపులు, విద్యుత్తు తదితర వస్తువులను ఎత్తుకెళ్లారు. దీంతో ప్రభుత్వం మళ్లీ మరమ్మతు పనులు చేపట్టారు. కాలనీలో కనీస సదుపాయాలు లేకపోవడంతో కొందరు ఆ ఇళ్లలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇంటి పట్టాలు తీసుకున్నా కొందరు లబ్ధిదారులు అద్దె ఇంట్లో ఉంటున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ లేకపోవడంతో చెత్తా చెదారం రోడ్డు పక్కన వేయడంతో దోమల బెడదతో పాటు దుర్వాసన వస్తోంది. ఈ కాలనీలో మిషన్ భగీరథ నీటి కోసం ప్రత్యేకంగా 'సంప్' నిర్మించారు. ఈ సంప్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు కేటాయించింది. కానీ ఆ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో కాలనీ వాసులు తాగునీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. 544 నిరుపేద కుటుంబాలకు సంబంధించిన ఈ కాలనీలో మౌలిక వసతులు కల్పించే బాధ్యత మున్సిపాలిటీ అధికారులు తీసుకోవాలి. ఇక్కడ పారిశుద్ధ్య నిర్వహణ లేదు. ఇళ్ల ముందు, రోడ్డు పక్కన చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రతి నెల కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తే పేదలకు మేలు జరుగుతుంది. అన్ని ఇళ్లకు మిషన్ భగీరథ నీటి కోసం ప్రత్యేకంగా పైపులైన్ నిర్మించాలి. ఇళ్లపైన నీటి నిల్వ కోసం ట్యాంకులను అమర్చాలని కలెక్టర్ చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. విషపురుగులు లోపలికి ప్రవేశించకుండా చుట్టూ ప్రహరి నిర్మించాలి. కాలనీలో నెలకొన్ని అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం ప్రత్యేకంగా నిధులు వెచ్చించాం. త్వరలో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరిస్తాం.

# ఐరిస్ ఇస్తేనే డబ్బుల జమ



సారంగాపూర్:ఇప్పటి వరకు ఓటీపీ పద్ధతి ద్వారా కొనుగోళ్లు చేపట్టి అమలు చేస్తుండగా ప్రస్తుతం తప్పనిసరిగా ఐరిస్ అమలు చేయాలని కేంద్రాల నిర్వాహకులకు పరికరాలను అందజేశారు. ధాన్యం విక్రయించిన తరువాత రైతు ఐరిస్(కనుపాపల)ను స్కానింగ్ చేసినప్పుడే ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ కానున్నాయి. ఈ విధానంతో రైతుల పేర ఎవరైనా అక్రమంగా విక్రయాలు సాగించేందుకు అవకాశం లేకుండా ఉండనుంది. అంతేకాకుండా గతంలో కేంద్రాల నుంచి ధాన్యం తరలించే సమయంలో మిల్లర్లకు ట్రక్ షీట్‌లో కేవలం సంచుల వివరాలు మాత్రమే నమోదు చేసి పంపించే వారు. ప్రస్తుతం లారీలో ఎంత మంది రైతుల ధాన్యాన్ని పంపిస్తున్నారు, ఎన్ని క్వింటాళ్లు పంపించారు అనే వివరాలు ట్రక్‌షీట్‌లో పొందుపరచాలని ఆదేశించారు. నూతన విధానంతో ధాన్యం విక్రయాల్లో పారదర్శకత ఉండనుందని అధికారులు, రైతులు భావిస్తున్నారు. ముందుగా రైతు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకు రాగానే టోకెన్ నంబర్ అందించి, రైతు, భూమి వివరాలు తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వ్యవసాయాధికారులు నమోదు చేసిన పంటల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. దీని ఆధారంగా రైతు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం ఎంత, సాగు చేసిన పంట మాత్రమే నమోదు అవుతుంది. ధాన్యం సేకరణలో గన్నీ సంచుల వివరాలు, విక్రయించిన సంచుల వివరాలు, నాణ్యత పూర్తిగా నమోదు చేయాల్సి ఉంటుంది. వీటన్నింటి ఆధారంగా తూకం వేసిన సంచుల వివరాలు నమోదు చేయగానే రైతు ఐరిస్‌ను తీసుకుంటారు. గతంలో రైతు ఎక్కడ ఉన్నా ఓటీపీ చెబితే సరిపోయేది. ప్రస్తుతం తప్పనిసరిగా రైతు ఉండాల్సిందే. ఐరిస్ విధానంతో అక్రమాలు జరగకుండా, రైతు ఉన్నప్పుడే ధాన్యం విక్రయించుకొనే అవకాశముంది. రైతు సాగు చేసిన పంటల వివరాలు వ్యవసాయాధికారులు ముందుగానే నమోదు చేయడంతో దీని ఆధారంగా విక్రయాల వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. దీని ద్వారా రైతులకు నేరుగా ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి.

# కరెంటు కష్టాలకు మోక్షమెన్నడో..!




**వెంకటాపురం, తెలంగాణ దిశ :**అంతరాయం లేని కరెంటు సరఫరాపై తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ దృష్టి సారించింది. లోపాలను సవరించడంతో పాటు క్షేత్రస్థాయిలో అవాంతరాలను అధిగమించేందుకు చర్యలు చేపట్టింది. విద్యుత్తు ఉప కేంద్రాల్లోనూ మెరుగైన సదుపాయాలు కల్పించింది. మన్యంలోని వెంకటాపురం, వాజేడు మండలాల్లో పరిస్థితి భిన్నంగా ఉంది. గాలివీచినా.. చినుకురాలినా కరెంటుకు అంతరాయం ఏర్పడుతోంది. సిబ్బంది కొరతతో పునరుద్ధరణలో జాప్యం జరుగుతుండటంతో.. ఇంకె న్నాళ్లకు కరెంటు కష్టాలకు మోక్షం కలుగుతుందోననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మెరుగైన సరఫరాకు ఏ, బీ స్విచ్‌ల ఏర్పాటుకు మోక్షం లేకుండా పోయింది. కరెంటు లైన్లలో సరఫరాలో తలెత్తే లోపాలను సిబ్బంది త్వరితగతిన గుర్తించడం, పరిష్కారానికి అవకాశం ఉండే వీటిపై దృష్టి సారించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. అదేక్రమంలో నియంత్రిక పరిధిలోనూ వీటిని ఏర్పాటు చేయాలనే ఆదేశాలున్నా.. ఆచరణకు నోచుకోకపోవడంతో.. ఎక్కడ సరఫరాలో అంతరాయం కలిగినా అంతటా కరెంటు నిలిపివేయాల్సి వస్తోంది. దశాబ్దాల క్రితం వెంకటాపురం, వాజేడు, ధర్మవరం, ఆలుబాకలో విద్యుత్తు ఉప కేంద్రాలను ఏర్పాటు చేయగా, వందల్లో ఉన్న కనెక్షన్ల సంఖ్య వేలల్లోకి చేరింది. ఒక్కో ఉప కేం ద్రంలో నలుగురు ఉద్యోగులను నియమించాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరే రాత్రి, పగలు విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగుల కొరత వేధిస్తోంది. ఏపీఎస్‌ఈబీ నిబంధనల మేరకు ప్రతీ 1,500 కనెక్షన్లకు ఒక జేఎల్‌ఎం పోస్టు భర్తీ చేయాలనే నిబంధన అటకెక్కింది. రెండు మండలాల్లో 35 పంచాయతీల్లో 97 గ్రామాల పరిధిలో సరఫరా జరుగుతుండగా.. ఏఎల్‌ఎంలు ఆరుగురు, లైన్ ఇన్‌స్పెక్టర్లు ముగ్గురు, అన్‌మ్యాన్డ్ ఒకరు, ఏఈ, సబ్ ఇంజినీర్‌తోనే నెట్టుకొస్తున్నారు. జేఎల్‌ఎం పోస్టు ఒక్కటీ లేకపోవడం గమనార్హం. వెంకటాపురంలోని విద్యుత్తు సరఫరా సహాయ ప్రాంతీయ ఇంజినీరింగ్ కార్యాలయమిది. మెరుగైన సేవల కోసం 2021లో ఇక్కడ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. రూ.లక్షలు వెచ్చించి భవన సదుపాయం కల్పించారు. ఏడీఈ స్థాయి అధికారి పోస్టును భర్తీ చేశారు. కార్యాలయ నిర్వహణకు అవసరమైన ఏ ఒక్క ఉద్యోగి నియామకం చేపట్టలేదు. ఒక్క అధికారే అన్నీ తానై చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మన్యంలోని వెంకటాపురం, వాజేడు మండలాల పరిధిలో నాలుగు విద్యుత్తు ఉప కేంద్రాలున్నాయి. రెండు సెక్షన్లుగా విభజించిన అధికారులు 15 ఫీడర్ల పరిధిలో విద్యుత్తును సరఫరా చేస్తున్నారు. 190 కి.మీ పరిధిలో 11కేవీ, 70 కి.మీ పరిధిలో 33కేవీ లైన్ విస్తరించి ఉంది. 15కేవీ నుంచి 100 కేవీ సామర్థ్యం కలిగిన 753 నియంత్రికలను ఏర్పాటు చేశారు. 18,450గృహం,3,010 వ్యవసాయం, కేటగిరి-2 కింద 1,250, పరిశ్రమలకింద 40విద్యుత్తు కనెక్షన్ల ద్వారా కరెంటు సరఫరా అందుతోంది. ఎల్‌టీ, 6.3కేవీ లైన్ సైతం పెద్దఎత్తునే ఏర్పాటు చేశారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు.. ఇక ఆధునిక హంగులు!




**జనగామ, తెలంగాణ దిశ :**అంగన్‌వాడీ కేంద్రాలను అత్యాధునిక రీతిలో తీర్చిదిద్దడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. గ్రామీణ స్థాయిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే పౌష్టికాహార ప్రాధాన్యత, పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తూ పిల్లలకు ప్రీస్కూల్ విద్యను కూడా అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలన్నింటినీ "కార్పొరేట్ కిడ్స్ స్కూల్ స్థాయి"లో అత్యాధునిక హంగులు కల్పించడానికి చర్యలు చేపట్టింది. జిల్లాలో కూడా కొద్ది నెలలుగా పలు పనులు ప్రారంభమయ్యా యి. జిల్లాలో మొదటి దశలో 33 అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించి, మెరుగైన వసతులు కల్పించడానికి పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. తొలుత సొంత భవనాలు ఉన్న కేంద్రాలను ఆధునాతనంగా తీర్చిదిద్దుతున్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న వాటికి నూతన భవన నిర్మాణాల సమయంలోనే తీర్చిదిద్దడానికి నిర్ణయించారు. కేంద్రాల్లో 3-6 ఏళ్ల లోపు పిల్లలు చదువు కోసం వెళ్తున్నారు. వీటిని కార్పొరేట్ కిడ్స్ పాఠశాలల మాదిరిగా తీర్చిదిద్దడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. భవనాలకు రంగులు వేయించడం, తరగతి గదిలో చిన్నారులను ఆకట్టుకునేందుకు బొమ్మల పెయింటింగ్, మరుగుదొడ్ల నిర్మాణం, సురక్షిత నీటి సౌకర్యాలను కల్పించడానికి చర్యలు చేపట్టారు. నూతనంగా ఫర్నీచర్ సమకూరుస్తున్నారు. వీటన్నింటికీ ఒక్కో కేంద్రానికి రూ.1లక్ష ఖర్చు చేస్తున్నారు. పనుల నిర్వహణ తీరును ఇటీవల జిల్లా పాలనాధికారి రిజ్వాన్‌బాషా కూడా సందర్శించారు. ఇప్పటికే జిల్లాలో కొన్ని కేంద్రాల్లో ఆధునిక హంగుల పనులు పూర్తి కావస్తుండటంతో కార్పొరేట్ కిడ్స్ స్కూళ్లను తలపిస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొదటి దశలో సొంత భవనాలు ఉన్న వాటిని తీర్చిదిద్దుతున్నాం. దశల వారీగా మిగతావి కూడా పూర్తి చేస్తాం. పనులు వేగంగా జరుగుతున్నాయి. పనులన్నీ పూర్తయితే చిన్నారులు ఉన్నత స్థాయి ప్రీ స్కూల్‌లో చదువుతున్న అనుభూతి పొందుతారు.

# ఇదా ఆకర్షణీయ నగరం!



**హనుమకొండ, తెలంగాణ దిశ :**ఎటు చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారంతో పరిసరాలన్నీ దుర్గంధంగా మారాయి. కొన్ని రోజులయితే ఈప్రాంతమంతా డంపింగ్ యార్డ్‌గా మారే అవకాశం ఉందని, నిత్యం దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక కాలనీవాసులు పేర్కొన్నారు. నగరంలోని 66 డివిజన్లలో పారిశుద్ధ్యం పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్యం పనులపై పర్యవేక్షణ కరవైంది. మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే సమీక్ష సమావేశాలతో సరిపెడుతున్నారు. ప్రజారోగ్య విభాగానికి చెందిన ఇద్దరు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. గతంలో వారానికి రెండుసార్లు డివిజన్లలో ఆకస్మిక తనిఖీలు చేసేవారు. కొన్ని నెలలుగా తనిఖీల్లేక పోవడంతో కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అడిగే వారు లేకపోవడంతో ప్రతిరోజూ 450- 500 మంది కార్మికులు పని చేయకుండానే జీతం పొందుతున్నారు. నెలవారీ మామూళ్లు అందుతుండటంతో పని చేయకున్నా జీతాలు ఇచ్చేందుకు సిఫార్సు చేస్తున్నారు. ఒప్పంద కార్మికులు 2650,. 452 తాత్కాలిక కార్మికులున్నా.. పారిశుద్ధ్యం పనులు దయనీయంగా ఉన్నాయి.' నగరంలోని 66 డివిజన్లలో చాలా మంది కార్మికులు పనికి రావడం లేదు. ఉదయం, మధ్యాహ్నం హాజరు వేసి ఇంటికెళ్తున్నారు. నెలకోసారి కూడా కాలనీల్లో మురుగు కాలువలు తీయడం లేదు. కాలనీవాసుల ఫిర్యాదులు పట్టించుకోవడం లేదు. ప్రధాన, అంతర్గత రహదారుల్లో రోజూ చెత్తను తరలించడం లేదు. డివిజన్లలోని పలు కూడళ్లలో రెండు రోజులకోసారి తీసుకెళ్తున్నారు. ఇంటింటా చెత్త సేకరణ రోజూ జరగడం లేదు. దీంతో ఇళ్లలో పోగవుతున్న చెత్తను వీధుల్లో, కాలువల్లో పడేస్తున్నారు. స్వచ్ఛ ఆటోలు మూడు, నాలుగు ట్రిప్పులు వేయాలి. ఒకటి లేదా రెండింటితో సరిపెడుతున్నారు.చెత్తను తరలించే ట్రాక్టర్లు రెండేసి ట్రిప్పులు పూర్తి సామర్థ్యంతో వెళ్లాలి. ఒకటే ట్రిప్పు లేదా, తక్కువ చెత్తతో వెళ్తున్నాయి. మురుగు కాలువల శుభ్రం చేసేందుకు కార్మికులకు కాలనీలు కేటాయించాలి. ఇంటింటా చెత్త సేకరణను ఆకస్మికంగా తనిఖీలు చేయాలి. చెత్తను తరలించే వాహనాలకు జీపీఆర్‌ఎస్ సిస్టమ్(వెహికల్ ట్రాకింగ్) ఏర్పాటు చేయాలి. మేయర్, కమిషనర్, అధికారులు నిరంతరం డివిజన్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. 66 డివిజన్ల వారీగా పారిశుద్ధ్యం పనులకు పక్కా ప్రణాళిక ఉండాలి. కాజీపేట, హనుమకొండ ప్రాంతాల్లో ఏ కాలనీకెళ్లినా మురుగు కాలువల నిండా వ్యర్థాలు, రహదారుల్లో చూస్తే చెత్త కనిపిస్తుంది. నగరంలో పారిశుద్ధ్యం పనులు అధ్వానంగా ఉన్నాయి. పనిచేయని ఉద్యోగులను బదిలీ చేయండి.

# ప్రైవేట్ వైపే రైతుల మొగ్గు



**భువనగిరి, తెలంగాణ దిశ :**ప్రభుత్వ కొనుగోలు సంస్థల్లో జరుగుతున్న జాప్యంతో రైతులు ధాన్యం వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తే ప్రైవేట్‌లోనే ఎక్కువగా జరిగాయి. తేమ శాతం ఎక్కువగా ఉండటంతో మిలర్లు, కమీషన్ ఏజెంట్లకు ఏదో ఒక ధరకు విక్రయిస్తున్నారు. క్వింటాకు రూ. 300 నుంచి రూ.600 వరకు రైతులు నష్టపోతున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో వ్యవసాయ మార్కెట్ యార్డులు, కల్లాల్లో మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులు కలిపి సుమారు 8,024 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా... ప్రభుత్వ సంస్థలు ఐకేపీ, పీఏసీఎస్‌ల్లో కేవలం 2,305 ఎంటీల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. దాదాపు నాలుగు రేట్లు అధికంగా ప్రైవేట్ వ్యాపారులు కొన్నారు. సెప్టెంబరు చివరి వారం నుంచే ధాన్యం కోతలు ఆరంభం కాగా.. అక్టోబరు రెండో వారం చివర్లో ప్రభుత్వ సంస్థలను తెరిచారు సన్నాలకు ప్రభుత్వం క్వింటాకు రూ.2,320, రూ.500 బోనస్ కలిసి రూ.2,820 చెల్లిస్తుంది. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల మేరకు ఉండాలి. కానీ ప్రైవేట్ మార్కెట్‌లో తేమతో సంబంధం లేకుండా క్వింటాకు రూ.2200 నుంచి రూ. 2400 వందల వరకు విక్రయిస్తున్నారు. 17శాతం తేమ, ఇతర నిబంధనలు లోబడి ఉంటే దొడ్డు రకం ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2320, సాధా రణ రకానికి రూ.2,300 కనీస మద్దతు ధర ఇస్తుండగా, ప్రైవేట్‌లో ఇవేమి చూడకుండా రూ.1800 నుంచి 2,150 వరకు వ్యాపారులు చెల్లిస్తున్నారు. సగటు మోడల్ ధర క్వింటాకు రూ. 1950 మాత్రమే ఉంది. ఈ లెక్కన రైతు క్వింటాకు రూ.450 నష్టపోతున్నారు. భువనగిరి మార్కెట్ యార్డులోనే 2,423 ఎంటీల ధాన్యాన్ని రైతులు విక్రయించారు. కమీషన్ ఏజెంట్లకు నూటికి రూ.3 కమీషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన క్వింటాకు రూ.600 వరకు నష్టపోతున్నా.. వారికే అమ్ముతున్నారు. మిల్లర్లు కూడా నేరుగా కొంటున్నారు. సీఎంఆర్ ధాన్యం తక్కువగా ఉండటంతో తగ్గిన మొత్తాన్ని కవర్ చేసుకునేందుకు మార్కెట్‌లో తక్కువ ధరకు కొందరు మిల్లర్లు కొంటున్నట్లు సమాచారం.

# కదలని ధాన్యం! అన్నదాత దైన్యం?



జిల్లాలోని రైతులను నష్టాలు వెంటాడుతున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి.. ఎంతో శ్రమించి పండించిన పంటలకు చి'వరి'కి ఫలితం లేకుండా పోతోంది. చేతికందే సమయంలో ఓవైపు వర్షాలు పంటలను నాశనం చేస్తుంటే.. మరో వైపు అధికారులు కొను గోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా జాప్యం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జనగామ, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల్లోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. చాలాచోట్ల పక్షం రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా ధాన్యం కేటాయింపులపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోకపోవడంతో జాప్యం నెలకొంటోందని తెలిసింది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, పర్వతగిరి లాంటి ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు కేంద్రాలను ప్రారంభిస్తున్నారే తప్ప.. కాంటాలు వేయట్లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మరోవైపు రెండు రోజులుగా అక్కడక్కడా వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం తడిసిపోతోంది. తిరిగి ఆరబెట్టడానికి రైతులు నానా కష్టాలు పడుతున్నారు. తడిసిన వరి ధాన్యాన్ని ఆరబోస్తున్న ఈ రైతు పేరు రేణుకుంట్ల పవన్.. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చైన్‌పాకకు చెందిన ఈయన రాఘవరెడ్డిపేట శివారులో రెండెకరాల పొలం కౌలుకు తీసుకొని సన్నాల సాగు చేశారు. కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రం ఉంటే సకాలంలోనే విక్రయించే వాడిననివాపోయారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించే విషయంపై ప్రభుత్వం నిర్ణయం వెల్లడించాల్సి ఉంది. గతంలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) చెల్లింపుల విషయంలో బ్లాక్ లిస్టులో ఉన్న మిల్లులకు బ్యాంకు గ్యారంటీలతో ధాన్యాన్ని కేటాయించాలని.. సీఎంఆర్ సకాలంలో చెల్లించే మిల్లుల విషయంలో బ్యాంక్ గ్యారంటీలకు మినహాయింపులు ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించినా ఈ విషయంపై మరింత స్పష్టత కోసం పలు జిల్లాల ఉన్నతాధికారులు ఎదురుచూస్తున్నారు. దీంతో కొన్నిచోట్ల కాంటాలు వేసిన ధాన్యాన్ని ప్రభుత్వ గోదాములకు తరలిస్తున్నారు.

# వాంకిడి గిరిజన ఆశ్రమంలో ఫుడ్ పాయిజన్



వాంకిడి,: వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం విదితమే.వాంకిడి ప్రభుత్వ దవాఖానలో చేర్పించగా, చికిత్స అనంతరం 27 మందిని తిరిగి హాస్టల్‌కు చేర్చారు. ఇందులో కొంతమంది విద్యార్థినులకు మళ్లీ వాంతులు విరేచనాలు కావడంతో తిరిగి దవాఖానలకు తరలించారు. మంచిర్యాల దవాఖానలో నాలుగురిని చేర్పించగా, మరో ఏడుగురిని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లోని దవాఖాలనకు తరలించారు. ఇక మరో నలుగురు వాంకిడి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారు.వైద్యసిబ్బంది ఆశ్రమంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అంతకుముందు ఫుడ్ సేఫ్టీ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు వచ్చి నీటి, ఆహార పదార్థాల శాంపిల్లను సేకరించారు. విద్యార్థినుల అస్వస్థతతకు కలుషితమై తాగునీరు, ఆహారమే కారణమని వైద్యులు చెబుతున్నారు.
జిల్లా అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల అస్వస్థతతకు గల కారణాలను వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బోరు నీటి శాంపిళ్లను ఆయన పరిశీలించారు.

# నా ఎంపిక-నా హక్కు...



ఈ రోజుల్లో యువత స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి, తమ జీవితాన్ని తమ అభిరుచులకు అనుగుణంగా నడిపించుకునేందుకు ముందుకు వస్తున్నారు. "నా ఎంపిక-నా హక్కు" అనే భావనను బలపర్చాలి. ఆత్మగౌరవంతో జీవించే హక్కును గుర్తించి అమలు చెయ్యాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మార్చి 8 సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నది. విద్య, వృత్తి, జీవనశైలి, ప్రేమ ఏ విషయంలోనైనా యువత తమకు నచ్చినది ఎంచుకునే స్వేచ్ఛ కలిగి ఉండాలి. సమాజం అభిప్రాయాలను చెప్పవచ్చు. మార్గనిర్దేశం చేయవచ్చు. కానీ బలవంతంగా నియంత్రించకూడదు. వ్యక్తిగత నిర్ణయాలను గౌరవించడం ప్రజాస్వామ్యాన్ని బలపర్చుతుంది. యువత సృజనాత్మకంగా కొత్త విషయాలను కనిపెట్టడానికి, వాటిని సమాజం ఉపయోగించుకోవడానికి దోహదపడుతుంది.

మహిళల విద్యకు ఈనాటికీ ఆటంకాలు ఎదురవుతున్నాయి. అందువల్ల పురుషులతో సమానంగా విద్యను పొందలేక పోతున్నారు. ఆర్థిక సమస్యలు, వరకట్నం, సామాజిక, సాంస్కృతిక ఆంక్షలు, పాఠశాలలు దూరంగా ఉండటం, సౌకర్యాల లేమి వంటి అంశాలు బాలికల విద్యను ప్రభావితం చేస్తున్నాయి. మహిళల విద్యకు, విభిన్న వృత్తులు చేపట్టటానికి ఉన్న ఆటంకాలను అధిగమించేందుకు ప్రభుత్వాలు, సమాజం, కుటుంబాలు కలిసికట్టుగా పనిచేయాలి. స్త్రీలు తమ ఆసక్తులు, లక్ష్యాలను అనుసరించి ముందుకు సాగేందుకు ప్రోత్సాహం అందిం చాలి. ఇది వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా, సమాజ పురోగతికి కూడా కీలకం. విభిన్న వృత్తులను ఎంచుకోవడంలో మహిళలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల సుప్రీంకోర్టు ఒక కేసులో తీర్పునిస్తూ మహిళలు పని చేసే వాతావరణం కల్పించడం అవసరమని పేర్కొన్నది. గర్భస్రావమైన స్త్రీ మానసిక, శారీరక స్థితిని గుర్తించకుండా ఇద్దరు మహిళా జడ్జీలను తొలగించిన మధ్యప్రదేశ్ హైకోర్టును 'సుప్రీం' తప్పుపట్టింది. సాంప్రదాయంగా, మహిళలకు నిర్దిష్టమైన వృత్తులు మాత్రమే అనుకూలంగా ఉంటాయని సమాజం నిర్ణయించేసింది. అయితే, మహిళలు ఇప్పుడు అన్ని రంగాల్లోకి అడుగు పెడుతున్నారు. కానీ, కొన్ని ప్రత్యేకమైన వృత్తులను ఎంచు కోవడంలో వారు ఇంకా అనేక ఆటంకాలను ఎదుర్కొంటున్నారు.

కొన్ని వృత్తులు పురుషులకు మాత్రమే సరైనవని భావించడం వల్ల, మహిళలకు అవకాశాలు దక్కడంలేదు. పోరాట క్రీడలు, విమాన పైలట్, ఇంజినీరింగ్, పోలీసు-సైనిక శాఖలు వంటి రంగాల్లో మహిళలను ప్రోత్సహించడంలో సమాజం ఇంకా వెనుకబడి ఉంది. కొన్ని వృత్తులు శారీరకంగా కష్టతరమని భావించి, కుటుంబ సభ్యులు మహిళలను ఆ దిశగా వెళ్ళనీయరు. కుటుంబ బాధ్యతల కారణంగాను, నైతిక విలువలపై కాపలా ఉండే స్వభావం వలన "మహిళల పని ఉదయం 9నుండి సాయంత్రం 5 వరకే ఉండాలి" అనే అపోహలు ఇంకా ఉన్నాయి. డ్రైవింగ్, మెకానిక్ వృత్తులు, టెక్నికల్ పనులు, రాజకీయ రంగం వంటివి పురుషులకు మాత్రమే అని భావించే సాంప్రదాయ ఆలోచనలు బలంగా కొనసాగుతున్నాయి.

మహిళలుఫ్యాషన్, బ్యూటీషియన్, టీచింగ్, నర్సింగ్ వంటి కొన్ని వృత్తులకు మాత్రమే పరిమితం కావాలని సమాజం నిర్దేశించే ప్రయత్నం చేస్తుంది. మహిళలు సమాన పనిని చేసినా, కొన్ని చోట్ల పురుషుల కంటే తక్కువ జీతం అందుకుంటున్నారు. ప్రసూతి సెలవులు, పిల్లల పెంపకం వంటి అంశాల వల్ల మహిళలు వృత్తిలో వెనుకబడే పరిస్థితి ఏర్పడుతుంది. వీటి పరిష్కారానికి కృషి చేయాలి. పిల్లలకు చిన్నతనం నుంచే "మగ-ఆడ వృత్తులు" అనే తేడాఉండదని నేర్పించాలి. ఆచరించాలి. భద్రతను మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలి. జీతాల్లో లింగ వివక్ష తొలగించాలి. మహిళలు ఎలాంటి వృత్తిని ఎంచుకున్నా కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలి. మహిళలు అన్ని రంగాల్లోకి ప్రవేశించేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

**మహిళలపై హింస:** ఉద్యోగ ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, అసభ్య వ్యవహారాలు అరికట్టే పరిస్థితి లేదు. ఇటీవల అమెరికాలో భద్రతా వ్యవస్థలో పని చేసే అధికారుల తీవ్రమైన సెక్స్ స్కాండల్ సంచలనం సృష్టించింది. మన దేశంలో, రాష్ట్రంలో కూడా స్త్రీలపై అత్యాచారాలు ఆందోళన కల్గిస్తున్నాయి. స్త్రీల శరీరాన్ని వ్యాపార వస్తువుగా మార్చడం, పురుషాధిక్యత, దాని వలన పెరిగిన పోర్న్ ఈ హింసకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. కఠినమైన చట్టాలు-సమర్థవంతమైన అమలు-అవగాహన-స్వీయరక్షణ-బాధితులకు మద్దతు అవసరం. ఇవి సమగ్రంగా అమలు చేసినప్పుడే మహిళలపై లైంగిక హింసను సమూలంగా అరికట్టగలం.

**కులాంతర వివాహాలు:** భారతీయ సమాజం వేగంగా మారుతోంది. కానీ కొన్ని మూఢనమ్మకాలు, కట్టుబాట్లు ఇప్పటికీ యువతను అణగదొక్కుతున్నాయి. కాలం చెల్లిన కుల, మత భావనలు పెంచి పోషించబడ్తున్నాయి. ముఖ్యంగా కులాంతర వివాహాల విషయంలో తల్లిదండ్రులు, బంధువులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, కొన్నిసార్లు హింసాకాండకు కూడా పాల్పడుతున్నారు. ఇది ఎంతవరకు న్యాయం? తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన పడటం సహజమే. కానీ, కేవలం కులం భిన్నంగా ఉందని పెళ్లిని అంగీకరించకుండా, ప్రేమించిన జంటల జీవితాన్ని నాశనం చేయడం తగదు. ప్రేమ, పరస్పర అంగీకారం, నమ్మకం ఉంటేనే ఒక కుటుంబం బలంగా నిలుస్తుంది. కేవలం కులం ఆధారంగా పెళ్లి అనుకూలం లేదా అననుకూలం అనే తీర్పు నష్టం కల్గిస్తుంది.

**పురోగతికి అడ్డంకి మూఢనమ్మకాలు:** కులమనే వ్యవస్థ అప్పటి సామాజిక పరిస్థితులలో ఏర్పడింది. కానీ,ఈ రోజుల్లో విద్య, ఉద్యోగం, ఆధునిక జీవన విధానాల వల్ల కుల పరిమితులు పెద్దగా సంబంధం లేని అంశాలయ్యాయి. అయినా, ప్రేమను కులంతో కొలవడం వెనుకబాటుతనమే. కులాంతర వివాహాలను అంగీకరించలేక, కొందరు తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తేవడం, బెదిరించడం, కొన్నిసార్లు హత్యలకు కూడా పాల్పడడం తీవ్రంగా సహించరానిది. ప్రేమ వివాహం చేసుకున్నందుకు ప్రేమతో, బాధ్యతతో పెంచిన తల్లిదండ్రులే దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారే?

తల్లిదండ్రులు తమ ఆలోచనలను మార్చుకోవాలి. పిల్లలు ఎవరిని ప్రేమించాలి, ఎవరితో జీవితాన్ని పంచుకోవాలి అనే నిర్ణయం వారి స్వేచ్ఛకు వదిలెయ్యాలి. ప్రేమను కులంతో కలిపి చూడకుండా, పరస్పర గౌరవం, నమ్మకం వివాహానికి కేంద్ర బిందువుగా చూడాలి. కులాంతర వివాహాలు సమాజ పురోగతికి సూచిక. ప్రేమకు కులం అడ్డుగా నిలిస్తే, అది నష్టమే కాని లాభం కాదు. తల్లిదండ్రులు తమ పిల్లల సంతోషాన్ని, స్వేచ్ఛను గౌరవించాలి.

**చివరికి, ప్రేమ నెగ్గాలి హింస కాదు!** మన రాష్ట్రంలో ఇటీవల కులాంతర వివాహాలు చేసుకున్న యువతీ యువకులు పరువు పేరిట హత్యలకు గురవుతున్నారు. ఈ ఘటనలు సమాజంలో పెరుగుతున్న కుల దురహంకారానికి నిదర్శనం. 2023 ఫిబ్రవరిలో నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని ఆలమూరు గ్రామంలో ప్రసన్న అనే యువతిని ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో వివాహం చేశారు. అయితే, పెళ్లికి ముందు ఆమె మరో యువకుడిని ప్రేమించిం ది. వివాహం తరువాత పుట్టింటికి వచ్చి, భర్త వద్దకు తిరిగి వెళ్లకుండా ఉండిపోయింది. కుమార్తె ప్రవర్తనతో పరువు పోయిందని భావించిన తండ్రి, ఆమెను గొంతు నులిమి చంపి, తల, మొండాన్ని వేరు చేసి,వేర్వేరు చోట్ల పడేశాడు.

2022 జూన్‌లో అనంతపురం జిల్లా కనగానపల్లి మండలంలో మరో పరువు హత్య జరిగింది. మురళి అనేయువకుడు, వీణఅనే యువతిని ప్రేమించి,వేర్వేరు కులాలకు చెందినప్పటికీ,పెద్దల అను మతి లేకుండా వివాహం చేసుకున్నారు. ఈ వివాహాన్ని జీర్ణించు కోలేని వీణ తల్లి, ముగ్గురు యువకులను పురామాయించి మురళిని కిడ్నాప్ చేసి, అనంతరం గొంతు కోసి హత్య చేయించింది. ఆంధ్ర ప్రదేశ్‌లోనూ, దేశంలోనూ ఈ ధోరణులు పెరగడమే కాదు మనువా ద ప్రచారాలు వీటిని పెంచుతున్నాయి. అయితే, సమాజంలో కులాం తరవివాహాలను అంగీకరించే కుటుంబాలు కూడా ఉన్నాయి. మన భారతీయసంస్కృతి సాంప్రదాయంలోకులాంతర వివాహాలు, స్వయం వరాలు అలవాటైనవే! శకుంతల, రుక్మిణి లాంటి ఎన్నో పౌరాణిక వివాహాలు గొప్పగా కీర్తించబడ్డాయి. తమ పిల్లల ఆనందానికి, స్వేచ్ఛకు ప్రాధాన్యతనిస్తూ, కుల అంతరాలు లేని సమాజ పురోగతికి తోడ్పడం ద్వారానే సామాజిక మార్పు, సమానత సాధ్యమవుతుంది.

"చర్యలను వేగవంతం చెయ్యాలి"అని ఐక్యరాజ్యసమితి పిలుపు. అన్ని రంగాల్లో అసమానత సాధించే వైపుగా ఈ చర్యలుండాలి. పైన సూచించిన అనేక అంశాలలో సమానత సాధనకు బడ్జెట్‌లో సముచిత ప్రాధాన్యతనివ్వాలి. స్త్రీల కోసం ప్రకటించిన వాగ్దానాలను అమలు చెయ్యాలి. అంటే అందుకు తగిన కేటాయింపులు ఉండాలి. మహిళా దినోత్సవ వేడుకలు మాటలకు, కాగితాలకు పరిమితం కారాదు. ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఉచిత బస్సు, డ్వాక్రా మహిళలకు జీరో వడ్డీ తదితర వాగ్దానాల అమలుకు పూనుకుంటూనే విద్య, ఉపాధి, భద్రత కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.


# ముదిరిన సెల్‌ఫోన్ వ్యసనం..



### సోషల్ మీడియా బానిసలుగా విద్యార్థులు
### 82% మంది సోషల్ మీడియాకే అంకితం
### 34% మంది వద్ద సొంత స్మార్ట్‌ఫోన్లు
### విద్యకు వినియోగించేవారు తక్కువే
### ఏఎస్ఈఆర్ నివేదికలో చేదు నిజాలు

హైదరాబాద్: పాఠశాల విద్యార్థుల్లో సెల్‌ఫోన్ వ్యసనం ముదిరిపోయింది. వారిలో చాలా మంది సోషల్ మీడియా మోజులో చిక్కుకుపోయారు. 14-16 ఏండ్ల మధ్య వయస్కుల్లో ఏకంగా 82% మంది తమ స్మార్ట్‌ఫోన్లను సోషల్ మీడియా కోసమే ఉపయోగిస్తున్నారు. వయసుల వారీగా చూస్తే..14 ఏండ్ల వయస్సుల్లో 79% మంది, 15 ఏండ్ల వయస్కుల్లో 82.2% మంది, 16 ఏండ్ల వయస్కుల్లో 82.5% మంది సోషల్ మీడియాలో మునిగిపోతున్నట్టు వార్షిక విద్యాస్థాయి నివేదిక (యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు) వెల్లడించింది. 14-16 ఏండ్ల వయస్కులు విద్యకు సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు స్మార్ట్‌ఫోన్లను అంతంతమాత్రంగానే ఉపయోగిస్తున్నట్టు ఈ నివేదిక తేల్చింది. బాలురే స్మార్ట్: బాలికలతో పోల్చితే బాలురే అధికంగా స్మార్ట్‌ఫోన్లను, సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నట్టు ఏఎస్ఈఆర్ వెల్లడించింది. రాష్ట్రంలోని 96% మంది విద్యార్థుల ఇండ్లల్లో స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. 97% మంది బాలురు, 94%మంది బాలికల ఇండ్లల్లో స్మార్ట్‌ఫోన్లు ఉన్నట్టు తేలింది. సామాజిక మాధ్యమాల నుంచి రక్షణ పొందే విషయమై విద్యార్థులకు అవగాహన బాగానే ఉన్నది. ఖాతాను బ్లాక్ చేయడంపై 67.2% మంది, పాస్‌వర్డ్ మార్చడం 62% మంది, ప్రొఫైల్‌ను గోప్యంగా ఉంచుకోవడంపై 60.8% మంది విద్యార్థులు అవగాహన కలిగి ఉన్నారు. చదువు కోసం స్మార్ట్‌ఫోన్లను వాడుతున్న విద్యార్థులు 61.1% మందే. బాలురలో 60.7%, బాలికల్లో 61.5% మంది చదువుల కోసం స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నారు. విద్యార్థుల్లో 34.3% మందికి సొంత స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. బాలురలో 39% మంది,బాలికల్లో 29% మంది సొంత స్మార్ట్‌ఫోన్లను కలిగిఉన్నారు. వయసులవారీగా చూస్తే.. 16 వయస్కుల్లో 46.3%,

# తాటిబెల్లంలో ఉండే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు..




మన చుట్టూ ఉండే ప్రకృతిలో ఎన్నో ఆరోగ్యకరమైన ఆహారాలు అందుబాటులో ఉన్నాయి. కానీ చాలా మంది మాత్రం రోజూ అనారోగ్యకరమైన ఆహారాలనే తింటున్నారు. బేకరీ పదార్థాలు, జంక్ ఫుడ్, నూనె పదార్థాలు, స్వీట్లను ఎక్కువగా తింటున్నారు. దీని వల్ల రోగాల బారిన పడుతున్నారు. అయితే ఆరోగ్యకరమైన ఆహారాలను రోజూ తింటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ఎలాంటి రోగాలు రాకుండా చూసుకోవచ్చు. ఇక ప్రకృతి మనకు అందిస్తున్న ఆరోగ్యకరమైన ఆహారాల్లో తాటి బెల్లం కూడా ఒకటి. దీన్ని మనం రహదారుల పక్కన చూడవచ్చు. చాలా మంది తాటిబెల్లాన్ని విక్రయిస్తుంటారు. అయితే తాటి బెల్లంను అది ఉన్న రంగు కారణంగా చాలా మంది ఇష్ట పడరు. కానీ ఇది అందించే ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే తాటి బెల్లంను ఇప్పుడే తినడం మొదలు పెడతారు. అన్ని ఆరోగ్య ప్రయోజనాలను ఇది అందిస్తుంది.

రక్తహీనతకు ఔషధం..: తాటిబెల్లంలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. దీంతో రక్తం ఎక్కువగా తయారవుతుంది. రక్తహీనత సమస్య ఉన్నవారికి తాటిబెల్లం చక్కని ఆప్షన్ అని చెప్పవచ్చు. రోజువారి ఆహారంలో తాటిబెల్లాన్ని తింటుంటే రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అలాగే ఇందులో మెగ్నిషియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ముఖ్యంగా నరాల బలహీనత తగ్గుతుంది. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు తాటిబెల్లంను ఆహారంలో భాగం చేసుకుంటే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. దీంతో కండరాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. కండరాలు పట్టుకుపోకుండా చూసుకోవచ్చు.

ఎముకల ఆరోగ్యానికి..: తాటిబెల్లంలో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో ఎముకలు బలంగా మారుతాయి. తాటిబెల్లంలో పొటాషియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలోకి వస్తుంది. కనుక హైబీపీ ఉన్నవారికి తాటిబెల్లం ఒక వరం అనే చెప్పవచ్చు. దీంతోగుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. తాటిబెల్లాన్ని మహిళలు తినడం వల్ల నెలసరి సమయంలో వచ్చే సమస్యలను తగ్గించుకోవచ్చు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్తాన్ని శుద్ధి చేస్తాయి. శరీరంలో దెబ్బ తిన్న కణజాలానికి మరమ్మత్తులు చేస్తాయి. దీంతో స్త్రీలలో వచ్చే సమస్యలు తగ్గుతాయి. తాటిబెల్లంలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది మలబద్ధకం, అజీర్తి సమస్యలను తగ్గిస్తుంది. శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపుతుంది. క్యాన్సర్ కారకాలతో పోరాడి క్యాన్సర్‌ను నివారించే గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. అలాగే తాటిబెల్లంను తింటే పొడి దగ్గు, ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. రోజూ ఒక టీస్పూన్ తాటిబెల్లం తినడం వల్ల మైగ్రెయిన్ నుంచి ఉపశమనం పొందవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. అధిక బరువును తగ్గించేందుకు ఈ బెల్లం ఎంతగానో పనిచేస్తుందని డాక్టర్లు సైతం చెబుతున్నారు.

# ఈ పండ్లను మీరు మార్కెట్‌లో చూశారా..?



మార్కెట్‌లో మనకు అనేక రకాల వెరైటీ పండ్లు ఈ మధ్య కాలంలో ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. చాలా మంది ఈ పండ్లను కొని తినేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. ఇక అలాంటి పండ్లలో స్టార్ ఫ్రూట్ కూడా ఒకటి. చెప్పినట్లుగానే నక్షత్రం ఆకారంలో ఈ పండు ఎంతో ఆకర్షణీయంగా పసుపు రంగులో కనిపిస్తుంది. దీని తియ్యదనం కారణంగా ఈ పండును చాలా మంది తీపి వంటకాల తయారీలో ఉపయోగిస్తుంటారు. అయితే స్టార్ ఫ్రూట్ ఆరోగ్య పరంగా మనకు అనేక లాభాలను అందిస్తుంది. స్టార్ ఫ్రూట్‌ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు. మన శరీరంలోని అనేక అవయవాలకు రక్షణ ఇవ్వడంలో ఈ పండ్లు అద్భుతంగా పనిచేస్తాయి. వీటిని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక పోషకాలను సైతం పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. స్టార్ ఫ్రూట్ ను 100 గ్రాములు మేర తింటే మనకు సుమారుగా 31 క్యాలరీలు మాత్రమే లభిస్తాయి. తియ్యగా ఉన్నప్పటికీ ఈ పండ్లలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కనుక బరువు తగ్గాలనుకునే వారికి ఈ పండ్లు బెస్ట్ ఆప్షన్ అని చెప్పవచ్చు. ఈ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల ఈ పండ్లను తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో తినే ఆహారం శాతం తగ్గుతుంది. ఫలితంగా అధిక బరువు తగ్గవచ్చు. ఈ పండ్లను 100 గ్రాముల మేర తింటే సుమారుగా 2.8 గ్రాముల మేర ఫైబర్ పొందవచ్చు. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. గ్యాస్, అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. మలబద్ధకం తగ్గుతుంది. స్టార్ ఫ్రూట్‌లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. దగ్గు, జలుబు నుంచి త్వరగా ఉపశమనం పొందవచ్చు. అలాగే ఈ పండ్లలోని విటమిన్ సి చర్మాన్ని సైతం ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మం పగలకుండా ఉంటుంది. స్టార్ ఫ్రూట్‌లో విటమిన్ ఎ కూడా అధిక మొత్తంలోనే ఉంటుంది. ఇది కూడా రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతోపాటు కళ్లను సంరక్షిస్తుంది. కంటి చూపు మెరుగు పడేందుకు సహాయం చేస్తుంది

# రక్తహీనత సమస్య ఉందా..
## వీటిని తింటే రక్తం ఎక్కువగా
# తయారవుతుంది..!



ప్రస్తుతం చాలా మంది రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. ఇది వచ్చేందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అయితే రక్తహీనత వచ్చేందుకు పోషకాహార లోపమే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. పోషకాలు లేని ఆహారాన్ని తింటున్నందునే చాలా మందిలో రక్తం తగినంతగా ఉండడం లేదని వారు అంటున్నారు.ముఖ్యంగా ఐరన్ లోపం సమస్యచాలా మందికి వస్తోంది. అలాగే ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరం అయ్యే విటమిన్ బి12 కూడా చాలా మందిలో లోపిస్తోంది. ఇది కూడా రక్తహీనతకు కారణం అవుతోంది. ఈ క్రమంలోనే కేవలం ఐరన్ మాత్రమే కాకుండా విటమిన్ బి12 ఉండే ఆహారాలను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇక రక్తహీనత తగ్గాలంటే తీసుకోవాల్సిన ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

జున్ను, బ్రౌన్ రైస్..: జున్ను నుంచి మనకు విటమిన్ బి12 పుష్కలంగా లభిస్తుంది. కనుక జున్ను పాలు లభించే అసలు విడిచిపెట్టకుండా తీసుకోండి. జున్నును విటమిన్ బి12కు గొప్ప వనరుగా చెప్పవచ్చు. అదేవిధంగా పాలు, పనీర్‌తోపాటు ఇతర పాల ఉత్పత్తుల్లోనూ విటమిన్ బి12 అధికంగానే ఉంటుంది. ఇది మన శరీరంలో ఎర్ర రక్త కణాలు తయారయ్యేలా చేస్తుంది. దీంతో రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అలాగే బ్రౌన్ రైస్‌ను ఎక్కువగా తినాలి. బ్రౌన్ రైస్‌లోనూ మనకు విటమిన్ బి12 సమృద్ధిగానే లభిస్తుంది. ప్రస్తుతం చాలా మంది తెల్ల అన్నాన్ని ఎక్కువగా తింటున్నారు. దీన్ని తినడం వల్ల బరువు పెరగడంతోపాటు డయాబెటిస్ బారిన కూడా పడుతున్నారు. కనుక బ్రౌన్ రైస్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇందులో ఉండే విటమిన్ బి12 రక్తం తయారయ్యేందుకు దోహదపడుతుంది. అలాగే పలు ఇతర పోషకాలు కూడా మనకు లభిస్తాయి.

పాలకూర జ్యూస్..: రక్తహీనత అధికంగా ఉన్నవారు రోజూ పాలకూరతో జ్యూస్ తయారు చేసి 30 ఎంఎల్ మోతాదులో సేవిస్తుంటే కచ్చితంగా ఫలితం ఉంటుంది. పాలకూర ద్వారా ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది రక్తకణాలు తయారయ్యేలా చేస్తుంది. దీంతో రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అదేవిధంగా

బీట్‌రూట్ జ్యూస్‌ను రోజూ ఒక కప్పు మోతాదులో తాగుతున్నా కూడా రక్తహీనత నుంచి బయట పడవచ్చు. బీట్‌రూట్‌లో బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉంటుంది. అలాగే దీని ద్వారా ఐరన్ కూడా మనకు ఎక్కువగానే లభిస్తుంది. కనుక బీట్‌రూట్ జ్యూస్‌ను తాగుతుంటే రక్తం అధికంగా తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడవచ్చు.

దానిమ్మ పండ్లు..: దానిమ్మ పండ్లను కూడా ఆహారంలో భాగం చేసుకోవాలి. రోజూ ఈ పండ్లను తింటే రక్తం అధికంగా తయారవుతుంది. లేదా ఈ పండ్ల జ్యూస్‌ను అయినా సరే రోజుకు ఒక కప్పు మోతాదులో తాగుతుండాలి.

ఈ పండ్లను తినడం వల్ల శరీరంలో రక్త సరఫరా సైతం మెరుగు పడుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే రోజూ గుప్పెడు కరివేపాకులను దంచి ఆ మిశ్రమాన్ని మజ్జిగలో కలిపి తీసుకుంటుండాలి. దీంతో రక్తాన్ని పెంచుకోవచ్చు. రక్తహీనత తగ్గుతుంది. రక్తం తయారయ్యేలా చేసేందుకు గాను తోటకూర కూడా ఎంతగానో పనిచేస్తుంది.

తోటకూరతో జ్యూస్ తయారు చేసి రోజూ తాగవచ్చు. లేదా తోటకూరను కూరగా వండుకుని తింటుండాలి. దీంతో రక్తం తయారవుతుంది. ఇలా పలు రకాల ఆహారాలను తినడం వల్ల విటమిన్ బి12 ఇంకా ఐరన్‌ను పొందవచ్చు. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడతారు.



## మీ పిల్లల్లో ఇమ్యూనిటీ పవర్‌ను పెంచాలంటే


# ఈ ఆహారాలను రోజూ తినిపించండి..!

సీజన్లు మారినప్పుడల్లా సహజంగానే చాలా మందికి దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తుంటాయి. చిన్నారులకు అయితే తరచూ ఈ సమస్యలు వస్తాయి. ఎల్లప్పుడూ వారు జలుబుతో ఇబ్బంది పడుతుంటారు. అయితే వారు తీసుకునే ఆహారంలో మార్పులు చేస్తే దాంతో వారి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దాని వల్ల వారికి దగ్గు, జలుబు వంటి అనారోగ్య సమస్యలు రాకుండా అడ్డుకట్ట వేయవచ్చు. చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచితే వారికి ఎలాంటి రోగాలు రాకుండా చూడవచచు. అందుకు గాను పలు ఆహారాలను తరచూ ఇవ్వాల్సి ఉంటుంది. వాటితో ఇమ్యూనిటీ పెరగడమే కాదు, వారి శరీరానికి కావల్సిన పోషకాలు, శక్తి కూడా లభిస్తాయి. ఇక చిన్నారుల్లో ఇమ్యూనిటీ పవర్‌ను పెంచే ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

సిట్రస్ పండ్లు..: సిట్రస్ జాతికి చెందిన పండ్లను ఇస్తుంటే చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. నారింజ, నిమ్మ, గ్రేప్ ఫ్రూట్ వంటి పండ్లను వారికి ఇస్తుండాలి. వీటిల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. అలాగే స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీలను కూడా ఇవ్వవచ్చు. వీటిల్లో విటమిన్ సి తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి పిల్లల్లో ఇమ్యూనిటీని పెంచుతాయి. ఆకుపచ్చని కూరగాయలు లేదా ఆకుకూరలను కూడా పిల్లలకు పెడుతుండాలి. పాలకూర, బ్రోకలీ వంటి కూరగాయల్లో విటమిన్లు ఎ, సి, ఇ, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. చిలగడదుంపలలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఈ ఆహారాలను పిల్లలకు తినిపిస్తే వారిలో రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు. కోడిగుడ్లు..: కోడిగుడ్లలో ప్రోటీన్లతోపాటు విటమిన్ ఎ, బి12 సెలీనియం అధికంగా ఉంటాయి. జింక్ కూడా పుష్కలంగానే ఉంటుంది. కోడిగుడ్లను రోజుకు ఒకటి చొప్పున పిల్లలకు ఇస్తుండాలి. ఇవి వారిలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. చికెన్, చేపల్లోనూ ప్రోటీన్లు, జింక్ ఎక్కువగానే ఉంటాయి. ఇవి కూడా ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతాయి. తరచూ వీటిని పిల్లలకు ఆహారంలో పెడుతుండాలి. బాదంపప్పు, వాల్ నట్స్ వంటి నట్స్‌తోపాటు చియా సీడ్స్, పొద్దు తిరుగుడు విత్తనాలు వంటి విత్తనాలను కూడా పిల్లలకు పెట్టాలి. వీటిల్లో విటమిన్ ఇ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి చిన్నారుల ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతాయి. రోగాలు రాకుండా చూస్తాయి.

పెరుగు..: పెరుగు మంచి ప్రొ బయోటిక్ ఆహారం. దీన్ని పిల్లలకు రోజూ పెట్టాలి. కొందరు పిల్లలు పెరుగు తినేందుకు ఇష్టపడరు. అలాంటప్పుడు నేరుగా దాన్ని పెట్టకుండా అందులో కాస్త చక్కెర లేదా పండ్ల ముక్కలు కలిపి ఇవ్వాలి. దీంతో వారు పెరుగును ఇష్టంగా తింటారు. పెరుగు జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. ఇది పిల్లల్లో జీర్ణ సమస్యలు రాకుండా చూస్తుంది. వెల్లుల్లి, అల్లం వంటి ఆహారాలను కూడా పిల్లలకు ఇస్తుండాలి. వీటిల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఇలా పలు రకాల ఆహారాలను పిల్లలకు పెట్టడం వల్ల వారిలో ఇమ్యూనిటీ పవర్‌ను పెంచవచ్చు. వారిలో వ్యాధులు రాకుండా చూడవచ్చు. ఆరోగ్యంగా ఉంటారు.

## పుస్తకాలు చదవడం ఆత్మవిశ్వాసాన్ని పెంచే అలవాటు..



పుస్తకాలు చదవడం అనేది మన జీవితంలో అత్యంత ఉపయోగకరమైన అలవాట్లలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఇది మన యొక్క వ్యక్తిత్వాన్ని పెంపొందించే, మన ఆలోచనలను విస్తరించే మరియు మన అనుభవాలను పెంచే గొప్ప మార్గం. పుస్తకాలు చదవడం మనకు కేవలం కొత్త సమాచారం మాత్రమే అందించదు, దానితో పాటుగా మనిషి యొక్క ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మొదటిగా, పుస్తకాలు చదవడం మన ఆలోచనా శక్తిని పెంచుతుంది. రకరకాల పుస్తకాలు, పాఠాలు చదవడం మనం ముందుగా ఊహించని కొత్త ఆలోచనలను, దృక్కోణాలను మనలో నింపుతుంది. ఈ మార్పులు మన ఆలోచనల్లో కొత్త దారులు తెరవడమే కాకుండా సమస్యలను పరిష్కరించడంలో సహాయపడతాయి. పుస్తకాలు మనకు విజ్ఞానాన్ని, విద్యను అందిస్తాయి. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకోవడం ద్వారా మన మనస్సును తెరవడానికి, మరియు ప్రస్తుతానికి సరిపడే అభిరుచులను పెంచుకోవడానికి అవకాషం లభిస్తుంది. వ్యక్తిగత అభివృద్ధి కోసం సాహిత్యం, చరిత్ర, విజ్ఞానం, సైన్స్, సాంఘిక శాస్త్రాలు వంటి విభిన్న విభాగాల్లో పుస్తకాలు చదవడం చాలా ముఖ్యమైంది. అలాగే, పుస్తకాలు మన సమయాన్ని సక్రమంగా వినియోగించడానికి సహాయపడతాయి. టీవీ లేదా సోషల్ మీడియా చూస్తున్నప్పుడు మన సమయం వృథా అవుతుంది, కానీ పుస్తకాలు చదవడం ద్వారా మనం కొత్తగా నేర్చుకుంటూ సమయాన్ని సృజనాత్మకంగా ఉపయోగించుకోవచ్చు.

# గ్రీన్‌టీతో డయాబెటిస్ అదుపులో ఉంటుందా..?

## షుగర్ బాధితులంతా ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే..!



డయాబెటిస్ అనేది తీవ్రమైన ఆరోగ్య సమస్యల్లో ఒకటి. ఇది అన్ని వయసుల వారిలో కనిపిస్తుంది. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ డయాబెటిస్‌కి బాధితులుగా మారుతారు. షుగర్ వ్యాధిని అదుపులో ఉంచుకునేందుకు జీవనశైలి, ఆహారం రెండింటినీ మెరుగుపరుచుకోవడం అవసరం. దీన్ని అదుపులో ఉంచుకునేందుకు గ్లైసెమిక్ ఇండెక్స్ 55 కంటే తక్కువ ఉన్న వాటినే తినాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వీటినే తీసుకుంటే షుగర్ వేగంగా పెరిగే ప్రమాదం ఉండదని పేర్కొంటున్నారు. చక్కెర పెరగకుండా నిరోధించేందుకు క్రమం తప్పకుండా గ్రీన్ టీ తాగడం అలవాటు చేసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. గ్రీన్ టీ అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా.. ప్రపంచవ్యాప్తంగా దాని డిమాండ్ పెరిగింది. ఇది అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించే ప్రభావవంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. గ్రీన్ టీ డయాబెటిస్‌కి ఆరోగ్యంపరంగా ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. గ్రీన్ టీ కేవలం రిఫ్రెషర్ పానీయం మాత్రమే కాదని.. వ్యాధుల నుంచి దూరంగా ఉంచడంలో ఇది సహాయపడుతుంది. రక్తంలో షుగర్ లెవల్స్‌ని నియంత్రించేందుకు మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి గ్రీన్ టీ గొప్ప పానీయమని పరిశోధకులు గుర్తించారు. గ్రీన్ టీలో కాటెచిన్ అనే మూలకం ఉంటుంది. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడానికి ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. గ్లూకోజ్‌ను గ్రహించే కణాల సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా రక్తంలో చక్కెరను సమర్థవంతంగా నియంత్రించడంలో ప్రయోజనం పొందొచ్చు. మెడిటేరియన్ డైట్ ప్లాన్‌లో గ్రీన్ టీని చేరిస్తే టైప్-2 డయాబెటిస్‌ని నివారించడంలో సహాయపడుతుందని పరిశోధన చూపిస్తుంది. దీన్ని అలవాట్లు చేసుకున్న వ్యక్తులకు డయాబెటిస్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉన్నది. పరిశోధనలో, గ్రీన్ టీ ఇన్సులిన్ కార్యకలాపాలను పెంచడంలో, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు గుర్తించారు.

అధ్యయనాల్లో ఏం గుర్తించారంటే..?: కొన్ని అధ్యయనాల ప్రకారం.. ప్రతిరోజూ రెండు నుంచి మూడు కప్పుల గ్రీన్ టీ తాగేవారికి టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 19శాతం తక్కువగా ఉండవచ్చు. ఈ పానీయాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ఉపవాసం సమయంలో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. ఇది కంటి సమస్యలు, గుండె సమస్యలు, నరాల సమస్యలు వంటి మధుమేహం వల్ల కలిగే ఇతర సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. డయాబెటిస్ నిర్వహణలో బరువు నియంత్రణ కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. జీవక్రియను పెంచడం ద్వారా బరువు తగ్గడంలో గ్రీన్ టీ మీకు సహాయపడుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంటుంది. గ్రీన్ టీ తాగడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో, రక్తపోటును సమతుల్యం చేయడంలో కూడా సహాయపడుతుందని అధ్యయనాలు గుర్తించాయి. చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో ఇది సహాయపడే పానీయమని స్టడీస్ చెబుతున్నాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఓ అధ్యయనం ప్రకారం గ్రీన్ టీ తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని 31శాతం తగ్గించుకోవచ్చు. అయితే, గుండె ఆరోగ్యానికి గ్రీన్ టీ వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోవడానికి మరిన్ని క్లినికల్ ట్రయల్స్ అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు.

# కొబ్బరినీళ్లకు తోడుగా..

వేసవితాపాన్ని తీర్చడంలో కొబ్బరినీళ్లు ముందుంటాయి. పొటాషియం, మెగ్నీషియం, సోడియంలాంటి ఎలక్ట్రోలైట్లతోపాటు అనేక పోషకాలతో నిండిన ఈ నీళ్లు.. ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. శరీరాన్ని హైడ్రేటె డ్‌గా ఉంచడంతోపాటు కండరాలు, నరాల పనితీరుకు మద్దతుని స్తాయి. అలాంటి కొబ్బరినీళ్లకు ఇతర పదార్థాలను జోడించడం ద్వారా మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు సమకూరుతాయి.

పుదీనా : కొబ్బరి నీళ్లకు పుదీనాను జోడిస్తే.. అద్భుతమైన రిఫ్రెషింగ్ డ్రింక్ తయారవుతుంది. ఇది శరీరాన్ని చల్లబరచడంతోపాటు జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సమర్థంగా పనిచేస్తుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యను తగ్గిస్తుంది. పుదీనాలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు.. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

నిమ్మరసం : విటమిన్ సితోపాటు హైడ్రేషన్‌కు మద్దతునిచ్చే ఎంజైమ్‌లు నిమ్మరసంలో పుష్కలంగా ఉంటాయి. ఆమ్ల స్వభావం కలిగిన నిమ్మరసం, ఆల్కలీన్ కొబ్బరినీళ్లతో కలిసి.. శరీర పీహెచ్‌ను సమతుల్యం చేయడంలో సాయపడుతుంది.

తేనె : కొబ్బరినీళ్లకు తేనె కలిపి తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆయుర్వేదం చెబుతున్నది. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు, ఎంజైములు, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కొబ్బరినీటిలోని ఖనిజాలతో కలిసి.. ఇన్ఫెక్షన్లతో పోరాడే శక్తిని శరీరానికి అందిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచి ఆరోగ్యానికి అండగా నిలుస్తాయి.



చియా విత్తనాలు : ఫైబర్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభించే చియా విత్తనాలను కొబ్బరినీళ్లలో కలిపితే.. శరీరానికి కావాల్సిన శక్తినిచ్చే పానీయం సిద్ధమవుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. శరీరం ఎక్కువసేపు హైడ్రేటెడ్‌గా ఉండటంలో సహాయపడుతుంది. గుండె, మెదడు ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది.

నల్ల ఉప్పు : కొబ్బరినీళ్లలోని పొటాషియం, మెగ్నీషియం.. నల్ల ఉప్పులోని సోడియం, ఐరన్, సల్ఫర్ వంటి ఖనిజాలు కలిసి.. ఎలక్ట్రోలైట్ రిచ్ డ్రింక్‌గా తయారవుతుంది. నల్ల ఉప్పులోని కార్మినేటివ్ లక్షణాలు.. ఆకలిని నిరోధిస్తాయని ఆయుర్వేదం చెబుతున్నది. ఇవి కొబ్బరినీళ్లతో కలిసినప్పుడు జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

# దురలవాట్లతో కాలేయ అనారోగ్యం



కాలేయం లేదా లివర్ అనేది శరీర అవయవాల్లో అతి పెద్దది మాత్రమే కాకుండా అత్యంత ప్రధానమైనదిగా వైద్య రంగం వర్గీక రించింది. సక్రమ జీవ వ్యవస్థ కొనసాగింపు, విష పదార్థాలను వడపోసి విసర్జించడం, అత్యవసర జీవ పదార్థాలను తయారు చేయడం, జీర్ణ వ్యవస్థ నుంచి పోషకాలతో నిండిన మంచి రక్తాన్ని తీసుకొని శరీర అవయవాలకు సరఫరా చేయటం లాంటి 500 పైగా విధులను నిర్వహిస్తూ మనకు నిత్య ఆరోగ్య సౌభాగ్యాన్ని కాలేయం అందిస్తున్నది. మన చెడు అలవాట్ల ప్రభావం ప్రత్యక్షంగా కాలేయం మీదనే పడుతుందనే కనీస పరిజ్ఞానర మనకు వుండాలి. లివర్ ఆరోగ్యమే మన ఆరోగ్యమని తలచి జీవనశైలిని మార్చుకోవాలి. ప్రపంచవ్యాప్తం గా దాదాపు 20 లక్షల మంది కాలేయ సంబంధ వ్యాధులతో చనిపోతున్నారని, మరణానికి కారణమైన వ్యాధుల్లో లివర్ వ్యాధులు కూడా ఉన్నాయని తెలుసుకోవాలి. అన్ని వయసుల వారిలో దాదాపు 30 శాతం మందిని కాలేయ సంబంధ రుగ్మతలు వేధిస్తున్నట్లు అంచనా వేస్తున్న వేళ మన కాలేయాన్ని మనమే రక్షించుకోవడం అత్యవసరం.

శరీరానికి శక్తినిచ్చే కేంద్రంగా విలక్షణ విధులను నిర్వహిస్తున్న కాలేయం పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 19 ఏప్రిల్ రోజున "ప్రపంచ కాలేయ దినం" పాటిస్తున్నాం. ఈ ఏడాది ఇతివృత్తంగా "ఆహారమే ఔషధం" అనే అంశాన్ని తీసుకొని విస్తృత ప్రచారం చేస్తున్నారు. మన తీసుకునే ఆహారమే మన లివర్ ఆరోగ్యానికి లేదా అనారోగ్యానికి హేతువుగా మారుతుందని గమనించాలి.


ఆల్కహాల్ సేవనం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, స్థూలకాయం, అనవసర ఔషధాల దుష్ప్రభావం, జన్యుపరమైన అంశాలు, దీర్ఘకాలిక అనారోగ్యాల కారక జీవనశైలి లాంటి అంశాలు కాలేయ అనారోగ్యానికి హేతువులు. దురలవాట్లు పెరిగి పెరిగి ఫ్యాటీ లివర్, హెపటైటిస్ (కామెర్లు), లివర్ ఫెయిల్యూర్, లివర్ క్యాన్సర్, లివర్ సిర్రోసిస్ లాంటి ప్రాణాంతక కాలేయ అనారోగ్యాలు కలుగుతాయి. చెడు అలవాట్లు మితిమీరి చర్మం/కళ్లు పసుపు పచ్చగా మారడం, కడుపు నొప్పి లేదా వాపు రావడం, అకారణంగా బరువు తగ్గడం, ఆకలి మందగించడం, మూత్రం ముదురు పసుపు రంగులోకి మారడం, చర్మ దురద లాంటి పలు రోగ లక్షణాలు కనిపిస్తాయి. మన జీవనశైలిలో పలు మార్పులు చేసుకొన్నపుడు మన కాలేయం ఉత్తేజితమౌతుంది. ఆరోగ్యం సమకూరుతుంది. నిత్యం శారీరక వ్యాయామం, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, ఆల్కహాల్ సేవన దురలవాటుకు దూరంగా ఉండడం, విష పదార్థాలకు ఎక్స్‌పోజ్ కాకుండా ఉండడం లాంటి అంశాలు మన కాలేయ ఆరోగ్యానికి పునాదులుగా మారతాయి. సమతుల పోషకాహారం తీసుకోవడంతో లివర్ సంబంధ అనారోగ్యాలైన కాలేయ వాపు, కాలేయ రుగ్మతలు పూర్తిగా పలుచబడి మానవ శ్రేయస్సుకు ఊతం ఇస్తాయి.

# ఆకలి సరిగ్గా అవడం లేదా.. ఆహారం తినాలనిపించడం లేదా.. అయితే ఈ చిట్కాలను పాటించండి..

**తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే అజీర్తి ఏర్పడుతుంది. దీంతో ఆకలి వేయదు. ఆహారం తక్కువగా తింటారు. ఆకలి తగ్గేందుకు పలు ఇతర కారణాలు కూడా ఉంటాయి. జీర్ణాశయం లో ఎంజైమ్‌లు లేదా జీర్ణ రసాల ఉత్పత్తి తగ్గడం, లివర్ పనితీరు మందగించడం, మలబద్దకం, గ్యాస్ వంటి సమస్యలు ఉండడం వంటి కారణాల వల్ల కూడా ఆకలి ఉండదు. దీంతో ఆహారం సరిగ్గా తినలేకపోతుంటారు. అయితే పలు రకాల చిట్కాలను పాటిస్తే అజీర్తిని తగ్గించి ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేయవచ్చు. దీంతో ఆకలి కూడా పెరుగుతుంది. ఆకలి అసలు లేని వారు కొన్ని చిట్కాలను పాటిస్తే ఎంతో మేలు జరుగుతుంది. ఇక ఆ చిట్కాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.**

**మిరియాలు..:** ఆకలిని పెంచడంలో మిరియాలు అద్భుతంగా పనిచేస్తాయి. మిరియాలను పొడిగా చేసి చిటికెడు మోతాదులో తీసుకుని కాస్త తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం భోజనానికి 30 నిమిషాల ముందు చప్పరించాలి. దీంతో అజీర్తి తగ్గుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. మిరియాల పొడిని మజ్జిగలో కలిపి తాగుతున్నా ఉపశమనం లభిస్తుంది. ఆకలి పెరుగుతుంది. మిరియాలలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచుతాయి. జీర్ణ రసాలు సక్రమంగా ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీంతో ఆకలి పెరుగుతుంది. మిరియాలను తేనెతో కలిపి తినడం వల్ల రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే మలబద్దకం తగ్గుతుంది. మిరియాలతో కషాయం తయారు చేసి కూడా తాగవచ్చు.

**అల్లం రసం..:** ఆకలిని పెంచేందుకు అల్లం రసం కూడా ఎంతో పనిచేస్తుంది. ఒక టీస్పూన్ అల్లం రసాన్ని ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు సేవించాలి. అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవన్నీ పైత్యాన్ని తగ్గిస్తాయి. వికారం, అజీర్తి సమస్యల నుంచి బయట పడేస్తాయి. ఆకలి పెరిగేలా చేస్తాయి. ఆకలి లేని వారు రోజూ అల్లం రసాన్ని తాగుతుంటే ఫలితం



ఉంటుంది. అలాగే ఉసిరికాయ జ్యూస్‌ను రోజూ తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఉసిరికాయల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ఉండే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. దీంతో అజీర్తి తగ్గి ఆకలి పెరుగుతుంది. రోజూ ఉదయం పరగడుపునే 30 ఎంఎల్ మోతాదులో ఉసిరికాయ జ్యూస్‌ను తాగుతుంటే మంచి ఫలితం ఉంటుంది.

**యాలకులు..:** యాలకులను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. భోజనం చేసిన తరువాత రాత్రి పూట ఒక యాలక్కాయను నేరుగా అలాగే నమిలి తినాలి. ఇది అజీర్తిని తగ్గిస్తుంది. జీర్ణాశయంలో గ్యాస్ ఉత్పత్తిని అరికడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో ఆకలి పెరుగుతుంది. యాలకులను తినడం వల్ల రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. అలాగే నోట్లో ఉండే బ్యాక్టీరియా తగ్గుతుంది. నోటి దుర్వాసన నుంచి ఉపశమనం లభిస్తుంది. యాలక్కాయను రాత్రిపూట తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. నిద్ర చక్కగా పడుతుంది. పిప్పిళ్ల చూర్ణం పావు టీస్పూన్ మోతాదులో తీసుకుని దానికి ఒక టీస్పూన్ తేనెను కలిపి రాత్రి పూట నిద్రకు ముందు తీసుకోవాలి. ఈ మిశ్రమం ద్వారా ఆకలి పెరగడమే కాదు, పొట్ట దగ్గరి కొవ్వు కూడా కరుగుతుంది. ఇలా పలు చిట్కాలను పాటిస్తే ఆకలిని పెంచుకోవడమే కాదు, ఇతర ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

# కూలీ సినిమా చూసి ఎమోషనల్ అయిన రజనీకాంత్..



సూపర్ స్టార్ రజనీకాంత్ సినిమాల కోసం ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఎదురు చూస్తుంటారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం కూలీ. ఈ మూవీ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ సినిమాకు దర్శకత్వం వహించిన లోకేష్ కనగరాజ్ తాజాగా ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సూపర్ స్టార్ రజనీకాంత్ 'కూలీ' సినిమాను డబ్బింగ్ స్టూడియోలో చూశారు. ఆ తర్వాత నన్ను హగ్ చేసుకున్నారు. 'నాకు ఇది దళపతిలా అనిపించింది' అని చెప్పారు. ఆ రోజు రాత్రి నేను చాలా ప్రశాంతంగా నిద్రపోయాను అంటూ అనుభవాన్ని పంచుకున్నారు లోకేష్. ఈ వ్యాఖ్యలతో రజనీకాంత్ అభిమానుల్లో ఆసక్తి రెట్టింపు అయింది.

1991లో మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన దళపతి సినిమా, రజనీ కెరీర్‌లో ఎమోషన్, పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌లకు మారుపేరు. అలాంటి సినిమాను గుర్తు చేయడం అంటే, కూలీపై ఎంత కాన్ఫిడెన్స్ ఉందో అర్థమవుతోంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో లోకేష్ మాట్లాడుతూ, ముందు రజనీ సార్ కోసం ఒక ఫాంటసీ సినిమా కథను రాశా. ఆయన వెంటనే ఓకే చెప్పారు. కానీ సెట్స్‌పైకి వెళ్లాలంటే ఏడాదిన్నర పడుతుంది. అందుకే కూలీ కథతో ముందుకెళ్లాను. రజనీ సార్ లాంటి వారికైతే మనం ఏ కథనైనా రాయొచ్చు. ఆయనకు ఉన్న లార్జర్ దాన్ లైఫ్ ఇమేజ్‌ను 'కూలీ'లో ప్రెజెంట్ చేసేందుకు కొత్త టెక్నిక్స్, స్టైల్ ట్రై చేశాను. అయినా ఇది పూర్తిగా రజనీకాంత్ సినిమానే అని వివరించారు. ఈ భారీ ప్రాజెక్ట్‌లో పలు ఇండస్ట్రీలకి సంబంధించిన స్టార్స్ నటించారు. నాగార్జున (టాలీవుడ్), ఆమిర్ ఖాన్ (బాలీవుడ్), ఉపేంద్ర (కన్నడ), , సౌబిన్ షాహిర్ (మలయాళం), ఇంకా పూజా హెగ్డే స్పెషల్ సాంగ్ తో అభిమానులను ఉర్రూతలూగించనుంది. ఇప్పటికే ఆ పాట సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రం టెక్నికల్ గా అత్యున్నత స్థాయిలో రూపొందుతోంది. 'ఖైదీ', 'మాస్టర్', 'విక్రమ్', 'లియో' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాల తర్వాత లోకేష్ దర్శకత్వంలో వస్తున్న 'కూలీ'పై ప్రేక్షకుల అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడలో గ్రాండ్ రిలీజ్ చేయనున్నారు.

# సుకుమార్ శిష్యులు ఆయన కంటే స్టార్ డైరెక్టర్లు అవుతారా..?



తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఇంటలిజెంట్ డైరెక్టర్ గా మంచి గుర్తింపును సంపాదించుకున్న దర్శకుడు సుకుమార్ తన ఎంటైర్ కెరియర్ లో చేసిన సినిమాలు తక్కువే అయినప్పటికి వాటితో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఇక ఆయన ఇండస్ట్రీకి వచ్చి 20 సంవత్సరాలు పూర్తి అవుతున్నాయి. మరి ఇలాంటి క్రమంలోనే ఆయన గొప్ప దర్శకుడిగా పేరు సంపాదించుకొని ఇండియాలోనే టాప్ 3 డైరెక్టర్లలో ఒకడిగా ఎదిగాడు. పుష్ప 2సినిమాతో యావత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీ మొత్తాన్ని షేక్ చేశాడనే చెప్పాలి. మరి అలాంటి దర్శకుడు ఆయన చేసిన సినిమాల విషయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. తన దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్లు గా పని చేసిన వ్యక్తులు కొంతమంది ఇటీవల దర్శకులుగా మారారు.. వాళ్ళు చేసిన మొదటి సినిమాలతోనే మంచి సక్సెస్ లను సాధించడమే కాకుండా ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో వాళ్ళకంటు ఒక ఐడెంటిటిని క్రియేట్ చేసుకున్నారు. ముఖ్యంగా 'ఉప్పెన' సినిమాతో బుచ్చిబాబు దర్శకుడిగా మారి మంచి విజయాన్ని అందుకున్నాడు. మొదటి సినిమాతోనే వంద కోట్ల కలెక్షన్స్ ను రాబట్టిన దర్శకుడిగా పేరు సంపాదించుకున్నాడు. ఇక ఈయనతో పాటుగా శ్రీకాంత్ ఓదెల సైతం దసర సినిమాతో సూపర్ డూపర్ సక్సెస్ ని సాధించడమే కాకుండా ఆయనకంటూ ఒక ఐడెంటిటిని ఏర్పాటు చేసుకొని ప్రస్తుతం 'ప్యారడైజ్' అనే సినిమాను చేస్తున్నాడు. ఈ సినిమాతో ఆయనకంటూ ఒక సెపరేట్ క్రేజ్ తెచ్చుకోవాలని చూస్తున్నాడు. మరి ఇలాంటి సందర్భంలో ఇకమీదట ఆయన చేయబోతున్న సినిమాల విషయంలో ఎలాంటి సక్సెస్ లను సాధిస్తాడు. తద్వారా ఆయనకంటూ ఒక గొప్ప ఐడెంటిటిని క్రియేట్ చేసుకుంటాడా? లేదా అనేది కూడా తెలియాల్సి ఉంది. ఇక ఇప్పుడు చూస్తుంటే ఈ ఇద్దరు దర్శకులు సైతం సుకుమార్ రేంజ్ లో పాన్ ఇండియాలో తమ సత్తా చాటుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఇదంతా చూస్తున్న కొంతమంది సినిమా మేధావులు సైతం వీళ్లిద్దరూ సుకుమార్ ను మించిన మాస్ డైరెక్టర్లుగా మారబోతున్నారు అంటూ కొన్ని అభిప్రాయాలనైతే వ్యక్తం చేస్తున్నారు. ఇక ఏది ఏమైనా కూడా సుకుమార్ నుంచి వచ్చిన దర్శకులు స్టార్ డైరెక్టర్లుగా ఎదుగుతూ ఉండడం ఆయనకు గర్వకారణమనే చెప్పాలి. ఇక మిగతా స్టార్ డైరెక్టర్స్ నుంచి వచ్చిన ఏ దర్శకులు సైతం స్టార్ డైరెక్టర్ గా మారడం లేదు. ప్రస్తుతం ఉన్న రోజుల్లో అయితే అది అసాధ్యమనే చెప్పాలి. కేవలం సుకుమార్ శిష్యులు మాత్రమే టాప్ డైరెక్టర్లుగా ఎదుగుతున్నారు. వారికి మాత్రమే ఇది చెల్లిందని చెప్పాలి.

ఎందుకంటే సుకుమార్ దగ్గర దర్శకత్వ విభాగంలో పనిచేసే చాలా మంది కుర్రాళ్లను ఆయన తన కథలో లీనం చేస్తాడు. సినిమా కథని ఎలా రాయాలి అనేదాని మీద మంచి గ్రిప్ సంపాదించుకుంటారు. ఎందుకంటే సుకుమార్ అందరితో డిస్కషన్ చేస్తూ ఉంటాడు. కాబట్టి ఆయన దగ్గర ఉన్న టీమ్ అందరు చాలా యాక్టివ్ గా ఉంటారు. ఇక ఇలాంటి క్రమంలోనే ఆయన నుంచి వచ్చిన దర్శకులు స్టార్ డైరెక్టర్లుగా ఎదుగుతున్నారని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు.

# సరికొత్త రూల్స్‌తో బిగ్ బాస్ సీజన్ 9


## పోటీ మాములుగా ఉండదు మరి..!



బుల్లితెర ప్రేక్షకులకి మంచి వినోదం పంచుతున్న బిగ్ బాస్ రియాలిటీ షో సక్సెస్ ఫుల్‌గా ఎనిమిది సీజన్స్ పూర్తి చేసుకుంది. మరి కొద్ది రోజులలో సీజన్ 9 మొదలు కానుండగా, ఇప్పటికే ప్రమోషన్స్ మొదలు పెట్టారు. ఇటీవల పలు వీడియోలు విడుదల చేసి షోపై ఆసక్తి పెంచే ప్రయత్నం చేశారు. సెప్టెంబర్ 2025లో ఈ సీజన్ ప్రారంభం కానుండగా, ప్రస్తుతం షోకు సంబంధించి సన్నాహాలు చేస్తున్నారు. షోకి హోస్ట్‌గా కింగ్ నాగార్జుననే కొనసాగనున్నారని అధికారికంగా వెల్లడించారు. తాజా సమాచారం ప్రకారం, మేకర్స్ ఈ సీజన్‌లో కొన్ని కీలక మార్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సీక్రెట్ రూమ్, రీ–ఎంట్రీ వంటి పాత కాన్సెప్ట్‌లను తప్పించాలన్న ఆలోచనలో ఉన్నారు. వీటి బదులుగా కొత్త మైండ్ గేమ్స్, ఇంటెన్స్ డ్రామా అంశాలపై ఎక్కువగా ఫోకస్ చేయనున్నారు. ఎలిమినేషన్ ప్రాసెస్‌కి సంబంధించి కూడా కొన్ని నూతన నియమాలు ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. గత సీజన్‌లో శారీరక శ్రమ ఎక్కువగా ఉండటం వలన , కొందరు కంటెస్టెంట్లకు ఒత్తిడికి గురైనట్టు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లో మానసిక స్థైర్యం, వ్యక్తిత్వ ప్రదర్శన, సామాజిక పరిపక్వత వంటి అంశాలపై ఎక్కువగా ఆధారపడే టాస్కులు ప్లాన్ చేస్తున్నారు. ఈ సారి షోలో పాల్గొనే కంటెస్టెంట్స్ లిస్ట్ కూడా విడుదలైంది. సెలబ్రిటీలతో పాటు సామాన్యులని సైతం ఈ సారి బిగ్ బాస్ షోలోకి తీసుకోబోతున్నట్టు తెలుస్తుంది.బిగ్ బాస్ తెలుగు 9 మునుపటి సీజన్లను మించేలా మేకర్స్ ప్రత్యేక కసరత్తు చేస్తున్నారు. బిగ్ బాస్ షోలో పాల్గొనే కంటెస్టెంట్ల జాబితాలో రీతూ చౌదరి పేరు హైలెట్ అవుతోంది. ఆమెకు ఒకింత భారీ స్థాయిలోనే రెమ్యునరేషన్ ఆఫర్ చేశారని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్.నవ్య స్వామి, సుమంత్ అశ్విన్, జ్యోతి రాయ్ లతో పాటు కల్పికా గణేష్, తేజస్విని గౌడ, అలేఖ్య సిస్టర్స్ లో ఒకరు, ఆర్జే రాజ్, శ్రావణి వర్మ, సాయికిరణ్, దీపికా, ఈకనాథ్, దెబ్జానీ, మరి కొందరు ప్రముఖ సెలబ్రిటీలు ఈ షోలో పాల్గొనే ఛాన్స్ అయితే ఉంది.

# టాలీవుడ్ హీరోలపై జెనీలియా ప్రశంసల వర్షం..

## ఎన్టీఆర్ టాలెంట్ చూసి షాక్



'బాయ్స్' సినిమాతో తెలుగు సినీ ప్రపంచంలో అడుగుపెట్టి, 'బొమ్మరిల్లు' హాసినిగా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన అందాల తార జెనీలియా. బొమ్మరిల్లు చిత్రం ఆమెని తెలుగు ప్రేక్షకులకి చాలా దగ్గర చేసింది. 'సత్యం', 'సై', 'హ్యాపీ' వంటి చిత్రాల లో నటనపరంగా ఎంతగానో ఆకట్టుకుంది. ఆ తరువాత 'ఢీ', 'రెడీ', 'కొత్త బంగారు లోకం' వంటి హిట్ చిత్రాల్లో నటించిన జెనీలియా, తన కెరీర్ పీక్‌లో ఉండగానే సినిమాలకు గుడ్‌బై చెప్పేసి వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యత ఇచ్చింది. 2012లో వచ్చిన 'నా ఇష్టం' సినిమా తర్వాత వెండితెరకు దూరమైంది. బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్‌ను పెళ్లి చేసుకుని కొన్నేళ్ల పాటు వైవాహిక జీవితానికి ఎక్కువ ప్రధాన్యత ఇచ్చింది. ఇప్పుడు తిరిగి నటనపై దృష్టి పెట్టింది. ఇటీవల అమీర్ ఖాన్‌తో కలిసి 'సితారే జమీన్ పర్' అనే చిత్రంలో ముఖ్య పాత్ర పోషించిన జెనీలియా, ప్రస్తుతం 'జూనియర్' అనే సినిమాతో అలరిం చేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఆమె ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాం శంగా మారాయి. ఇప్పటి నుంచి నేను ప్రాధాన్యత ఉన్న పాత్రలకే సైన్ చేస్తాను. అవసరమైతే ఆ పాత్రల కోసం ఆడిషన్స్ ఇచ్చేందుకు కూడా సిద్ధం అంటూ జెనీలియా పేర్కొంది. ఇండస్ట్రీలోకి రావడం బొమ్మరిల్లులో హాసినిగా, హ్యాపీలో మధుమతిగా పాత్రలు చేయడం, ప్రేక్షకుల నుంచి విశేషమైనటువంటి అభిమానాలు పొందడం నాకు ఒక డ్రీమ్ లాగా అనిపిస్తుంది. ఇక టాలీవుడ్ హీరోలు రామ్ చరణ్, ఎన్టీఆర్, బన్నీ నా ఫ్రెండ్స్. చాలా అద్భుతమైన ప్రతిభ ఉన్న హీరోలు వారు. ఇప్పుడు వారిని సూపర్ స్టార్స్ గా చూస్తుంటే చాలా ఆనందంగా అనిపిస్తుంది. ఎన్టీఆర్ చాలా గొప్ప నటుడు. మూడు పేజీల డైలాగ్ కూడా ఒకేసారి చెప్పేస్తాడు. అలాంటి నటుడిని ఇంతవరకు చూడలే దు. ఇక రామ్ చరణ్ కూడా అద్భుతమైన నటుడు అని ప్రశంసించిన జెనీలియా.. ఆర్ఆర్ఆర్ చిత్రంలో అద్భుతంగా ప్రదర్శన కనబరిచిన ట్టు పేర్కొంది. ఇక అల్లు అర్జున్‌లో మంచి ఎనర్జీ ఉంటుందని స్పష్టం చేసింది ఈ ముద్దుగుమ్మ. ఇక రితేష్‌తో మజిలీ రీమేక్ చేశాను. అది అద్భుతమైన విజయాన్ని ఇచ్చింది. మరోమంచి లవ్ స్టోరీకుదిరితే సినిమా చేయాలని ఆలోచన అయితే ఉంది అని పేర్కొంది జెనీలియా.

# హరిహర వీరమల్లు ఇంటర్వెల్ ఎపిసోడ్ లో భారీ ట్విస్ట్ ఉంటుందా..?



తెలుగు సినిమా ఇండస్ట్రీలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌కి చాలా మంచి గుర్తింపైతే ఉంది. ఆయన చేసిన చాలా సినిమాలు అతనికి గొప్ప గుర్తింపును తీసుకురావడమే కాకుండా మంచి విజయాలను సాధించాయి. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఆయన సినిమాలను చేయడం లేదు. ప్రస్తుతం పాలిటిక్స్ లో బిజీగా ఉంటున్న ఆయన అడపాదడపా సినిమాలను చేస్తూ ముందుకు సాగుతున్నాడు. 2024 వ సంవత్సరములో జరిగిన ఎలక్షన్స్ కి ముందు కమిట్ అయిన సినిమాలను ఇప్పుడు పూర్తి చేసే పనిలో పవన్ కళ్యాణ్ బిజీగా ఉన్నాడు. ఇప్పటికే హరిహర వీరమల్లు సినిమా షూటింగ్ ను కంప్లీట్ చేయడమే కాకుండా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ మొత్తాన్ని ఫినిష్ చేసుకొని ఈనెల 24వ తేదీన ప్రేక్షకులు ముందుకు రాబోతోంది..తద్వారా ఆయన స్టార్ డమ్ అనేది ఇంకా విస్తరిస్తుందా లేదా అనేది కూడా తెలియాల్సి ఉంది. ఇక యావత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ఇప్పటివరకు ఎవరికీ దక్కనటువంటి గొప్ప క్రేజ్ ను సంపాదించుకున్న హీరో కూడా తనే కావడం విశేషం. మెగాస్టార్ చిరంజీవి క్రేజ్ ను సైతం పక్కకు నెట్టేసి తనకంటూ ఒక సపరేట్ ఐడెంటిటిని సంపాదించుకున్న నటుడు కూడా తనే కావడం విశేషం. ఇక ప్రస్తుతం ఏపీ డిప్యూటీ సీఎంగా తన పదవి బాధ్యతలను కొనసాగిస్తున్న ఆయన హరిహర వీరమల్లు సినిమాతో మరోసారి ప్రేక్షకులను పలకరించి సూపర్ సక్సెస్ ని సాధించడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నాడు..

# పవన్‌తో కచ్చితంగా సినిమా చేస్తా: మెహర్ రమేష్



టాలీవుడ్ ఫ్లాప్ చిత్రాల దర్శకుడు మెహర్ రమేష్ చివరిగా చిరంజీవితో భోళా శంకర్ అనే సినిమా చేసిన విషయం తెలిసిందే. ఈ చిత్రం పెద్ద డిజాస్టర్ అయింది. ఇప్పుడు ఆయన పవన్ కళ్యాణ్ తో కచ్చితంగా సినిమా చేస్తానని అంటున్నారు. దాంతో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ షాక్ కి గురవుతున్నారు. ప్రస్తుతం మెహర్ రమేష్ చేసిన కామెంట్స్ సోషల్ మీడియా అంతటా వైరల్‌గా మారాయి. మెహర్ రమేష్ తన కెరియర్ స్టార్టింగ్ లో 'బిల్లా' మూవీ తెరకెక్కించగా, ఈ చిత్రంతో సపరేట్ క్రేజ్ ఏర్పడింది. ఆ సినిమాలో ప్రభాస్‌ను చూపించిన విధానం, మెహర్ రమేష్ టేకింగ్ ఆడియన్స్ ని ఎంతగానో ఆకట్టుకుంది. దాంతో మెహర్ రమేష్ స్టార్ డైరెక్టర్ అవుతాడని అంతా అనుకున్నారు. కానీ దురదృష్టవశాత్తు ఈ డైరెక్టర్ చేసే సినిమాలు టాలీవుడ్ లో ఘోర పరాజయం చవిచూశాయి. దీంతో చాలా సంవత్సరాల పాటు డైరెక్షన్ జోలికి వెళ్లలేదు మెహర్ రమేష్. అయితే మెగాస్టార్ చిరంజీవి.. మెహర్‌ని నమ్మి ఛాన్స్ ఇవ్వగా, ఆయన తెరకెక్కించిన 'భోళా శంకర్' కూడా డిజాస్టర్ కావడంతో దర్శకుడిగా ఈయనపై ఎన్నో విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో మెహర్ రమేష్ ని చాలా మంది ట్రోల్ కూడా చేశారు. మెహర్ రమేష్ దర్శకత్వంపై ఆడియన్స్ లో నెగెటివ్ ఒపీనియన్ వచ్చేసింది. అలాంటి ఈ డైరెక్టర్ ఇప్పుడు పవర్ స్టార్ ఫ్యాన్స్ ఉలిక్కిపడేలా ఫ్యూచర్‌లో కచ్చితంగా సినిమా చేస్తానని స్టేట్‌మెంట్ ఇచ్చాడు. ఈ మధ్యే ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మెహర్ రమేష్ ఒకటికి రెండుసార్లు పవన్ కళ్యాణ్‌తో సినిమా విషయాన్ని నొక్కి వక్కాణించాడు. ఇది విని పవన్ కళ్యాణ్ కంగారు పడుతున్నారు. మెగా కుటుంబానికి మెహర్ రమేష్ బంధువు, అత్యంత సన్నిహితుడు కాగా, ఆ సాన్నిహిత్యంతోనే తన ట్రాక్ రికార్డు ఎలా ఉన్నప్పటికీ.. మెగాస్టార్ చిరంజీవి ఛాన్స్ ఇచ్చారు. ఈ సినిమాతో చిరుకి కూడా అవమానం జరిగింది. ఇక ఇప్పుడు చిరు తమ్ముడు పవన్ కళ్యాణ్‌తో సినిమా చేస్తానంటున్నాడు. సినిమా ఫిక్స్ అయింది అని అడిగితే, నేను ఫిక్సయ్యా. చిరంజీవి గారితో సినిమా చేయాలనుకు న్నాను. చేశాను. పవన్ కళ్యాణ్ గారితో 100 పర్సంట్ సినిమా చేస్తా" అని గట్టిగా చెప్పాడు మెహర్. అయితే పవన్ ఉన్న ఈ బిజీ షెడ్యూల్‌లో మెహర్ రమేష్‌తో సినిమా చేసే ఛాన్స్ ఉంటుందా చూడాలి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215